Bhavani Publication Trust https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక

కావలెను

ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక
The Largest Circulated Telugu Fortnightly

సామాజిక, రాజకీయాలపై అవగాహన ఉన్న ఉత్సహావంతులైన యువకులు జర్నలిస్ట్‌లుగా ఎదిగే గొప్ప సదావకాశం..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు పొందిన ప్రజాతీర్పు దినపత్రికలో తెలంగాణలోని అన్ని జిల్లాల్లో పని చేయడానికి స్టాఫ్ రిపోర్టర్లు, కంట్రిబ్యూటర్లు, అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్లు, సర్క్యులేషన్ ఇన్‌చార్జిలు కావలెను

వెంటనే కావలెను
• బ్యూరో ఇన్‌చార్జిలు • స్టాఫ్ రిపోర్టర్లు
ఆర్‌సి ఇన్‌చార్జిలు •మండల రిపోర్టర్లు

అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
ఆసక్తి ఉన్న వారు మీ పూర్తి బయోడేటా ఈ వాట్సాప్ నంబర్‌కు పంపగలరు
8309979541, 9885353018, 9494659622

సంపుటి : 26 | సంచిక : 255 | హైదరాబాద్ | గురువారం 30 జూలై 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR

# రేవంత్‌కు ఫుల్ పవర్!

## పీసీసీకి ఆదేశాలు కూడా.. అంతర్గత విబేధాలు.. అసమ్మతిని కట్టడి చేసేందుకు

### అలాంటి వారిపై అధిష్ఠానం సీరియస్..

### కొందరి తీరుతో జనంలో పరేషాన్

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)




అధికార కాంగ్రెస్ పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువ. పెద్ద నాయకుడి నుంచి గల్లీ లీడర్ వరకు అన్ని మాట్లాడేస్తారు. పార్టీలో అగ్రనాయకులను సైతం విమర్శిస్తారు. పార్టీ అధికారంలోకి రాకముందు వీటన్నింటినీ పార్టీ పెద్దలు సైతం పెద్దగా పట్టించుకోలేదు. కారణం ఎన్నికలే. కానీ, ఇప్పుడు పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అవుతుంది. అయినా కొందరు నేతలు పార్టీపై అగ్రనాయకులపై మాట్లాడుతూనే ఉన్నారు. ఒకరిపై మరొకరు విమర్శలు చేసుకుంటున్నారు. దీంతో అంతర్గత విబేధాలు, వాగ్వాదాలు జరుగుతుండటంపై పార్టీ అధిష్ఠానం సీరియస్ అయ్యింది. ఇకపై ఇలాంటి వాటికి చెక్ పెట్టాలని భావిస్తోంది.

**పీసీసీకి.. సీఎంకు పూర్తి అధికారాలు..**

పార్టీలో అసంతృప్తి నేతలు.. నాయకుల మధ్య అంతర్గత విబేధాలు పార్టీలోని ఢిల్లీ పెద్దల దృష్టికి వెళ్లాయి. తరచూ ఎవరో ఒకరు అక్కడికి వెళ్లి ఫిర్యాదులు చేయడం, ఆరోపణలు చేయడం తెలిసిందే. ఇక రాష్ట్రంలోనూ కొందరు నాయకులు ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. మంత్రిపదవుల కోసం.. నామినేటెడ్ పోస్టుల కోసం ఒత్తిడి తీసుకువచ్చే విధంగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయాలను తీవ్రంగా పరిగణించిన అధిష్ఠానం రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు గట్టి హెచ్చరిక జారీ చేసింది. పార్టీ లైన్ దాటిన నాయకులపై సస్పెన్షన్‌తో సహా కఠినమైన క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లకు హైకమాండ్ పూర్తి అధికారాన్ని ఇచ్చింది. న్యూఢిల్లీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్, రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌ల సమక్షంలో జరిగిన ఉన్నత స్థాయి రాజకీయ సంప్రదింపుల సందర్భంగా, ఇటీవలి అంతర్గత కలహాలపై హైకమాండ్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. రాష్ట్ర తిరుగుబాటుదారుల నుండి వచ్చే ప్రత్యక్ష విజ్ఞప్తులను లేదా ఫిర్యాదులను కేంద్ర నాయకత్వం స్వీకరించబోదని వేణుగోపాల్ స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణను అమలు చేయడంలో రాష్ట్ర నాయకత్వానికి మద్దతు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

**నేతల మధ్య వివాదాలు..**

ఇటీవల నల్లగొండ జిల్లాలోని ఇద్దరు ఎమ్మెల్యే మధ చోటు చేసుకున్న మాటల యుద్ధం నేపథ్యంలో హైకమాండ్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆయన సోదరుడు, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిలపై తుంగతుర్తి దళిత ఎమ్మెల్యే మందుల శామ్యూల్ చేసిన సంచలన బహిరంగ ప్రకటన దీనికి ప్రధాన కారణం. ప్రోటోకాల్ లేకుండా తన నియోజకవర్గానికి వచ్చి, స్థానిక వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారంటూ శామ్యూల్ ఆ సోదరులపై తీవ్రంగా మండిపడ్డారు. అలాగే, కామారెడ్డిలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు కూడా చర్చనీయాంశమయ్యాయి. పలు చోట్ల నియోజకవర్గ స్థాయిలో నేతల మధ్య విబేధాలు ఉన్నాయి. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని క్యాబినెట్‌లోకి తీసుకోకుండా అడ్డుకోవడానికి జరుగుతున్న పెద్ద అంతర్గత పోరాటంలో భాగంగానే నల్గొండలో ఇటీవల చోటుచేసుకున్న ఘర్షణను రాజకీయ పరిశీలకులు చూస్తున్నారు. ప్రతిపక్ష వర్గాలు 'ఒక కుటుంబానికి, ఒకే క్యాబినెట్ పదవి' అనే సూత్రాన్ని లేవనెత్తుతూ, బీసీ లేదా ఎస్టీ ప్రతినిధులకు ఖాళీ బెర్త్‌లను కేటాయించాలని నాయకత్వాన్ని కోరాయి.




## 'హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో డా. వకుళాభరణంకు జాతీయ విశిష్ట సేవా పురస్కారం

న్యూఢిల్లీ, జూలై 29 (ప్రజాతీర్పు)

తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావుకు జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ప్రతిష్ఠాత్మక 'జాతీయ విశిష్ట సేవా పురస్కారం' ప్రదానం చేసింది .న్యూఢిల్లీలోని ఆంధ్రా అసోసియేషన్ భవన్లో మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించిన 'హస్తినలో తెలుగు వెలుగు' వేడుకల్లో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీ భూపతిరాజు శ్రీనివాస వర్మ ఈ పురస్కారాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. ప్రజా జీవితం, వెనుకబడిన వర్గాల సంక్షేమం, తెలుగు భాషాసాహిత్యాభివృద్ధి, సామాజిక రంగాల్లో డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, జాతీయ తెలుగు సారస్వత పరిషత్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ రామప్రసాద్, పరిషత్ ప్రతినిధులు ముత్యాల శ్రీనివాస్, డాక్టర్ సుధీర్ రమణ, కాంతేటి వెంకటరాజు, ఆదిలీలా ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ ఎస్. ఆదినారాయణతో పాటు

- మిగతా 2వ పేజీలో



## బిల్లుకు సభ ఆమోదం

### సవరణ బిల్లు'కు సై

మూజువాణి ఓటుతో ఆమోదించిన లోక్‌సభ

అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవడానికి ప్రభుత్వం సిద్ధం

కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడి

బిల్లులో సవరణలు చేయాలన్న విపక్షాల వినతిని తిరస్కరించిన ప్రభుత్వం



విద్యార్థులను హింసించే

## హక్కు ఎవరిచ్చారు

మన విద్యార్థుల శరీరంలోకి పెల్లెట్లను దించారు

సభలో అమిత్ షాపై రాహుల్ గాంధీ ఆగ్రహం

విద్య ఖరీదైన వ్యాపారంగా, విద్యా వ్యవస్థ క్రూరంగా మారిందని ఆందోళన

విద్యార్థుల అసలైన శత్రువు ఆర్‌ఎస్‌ఎస్ అని ధ్వజం

# ఇరాన్‌పై భీకర దాడులు

## అమెరికా, సౌదీ దాడుల్లో 20 మంది మిలీసియాలు హతం

### ప్రతీకారంతో టెహ్రాన్ క్షిపణుల వర్షం



కైరో, జూలై 29: మధ్యప్రాచ్యంలోని అమెరికా బలగాలపై ఇరాన్ బుధవారం తెల్లవారుజామున క్షిపణుల వర్షం కురిపించింది. అదే సమయంలో, పొరుగున ఉన్న ఇరాక్‌లో టెహ్రాన్ మద్దతుగల మిలీషియాలపై అమెరికా, సౌదీ అరేబియాతో కలిసి భీకర దాడులు చేసింది. ఈ దాడిలో 20 మంది మిలీషియా తిరుగుబాటుదారులు మరణించారు. మరో 32 మంది గాయపడ్డారు. అమెరికా- దాడుల్లో ఆరుగురు ఇరాన్ సలహాదారులు మరణించారని ఇద్దరు ఇరాకీ మిలీషియా అధికారులు అసోసియేటెడ్ ప్రెస్‌కు తెలిపారు. మరణించిన యోధులలో ఈ సలహాదారులు కూడా ఉన్నారా లేదా అనేది వెంటనే స్పష్టం చేయలేదు. దీంతో కొన్ని రోజుల సాపేక్ష ప్రశాంతత తర్వాత, మళ్లీ ఉద్రిక్తతలు పెరిగాయి. గత రెండు రోజులుగా తమ చమురు కేంద్రాలపై ఇరాకీ మిలీషియాలు డ్రోన్లతో దాడులు చేశాయని సౌదీ అరేబియా ఆరోపించింది. ఇరాకీ మిలీషియాల ఒక గొడుగు సంస్థ మొదట ఈ ఆరోపణలను ఖండించింది. ఇరాన్ మద్దతు ఉన్న మరోబృందం యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు- తాము సౌదీ ఇంధన కేంద్రాలపై దాడి చేశామని తెలిపింది. అమెరికా సైనిక కేంద్రమైన జోర్డాన్‌లోని మువఫ్ఫాక్ సాల్టీ వైమానిక స్థావరంపై తాము బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు ఇరాన్ పారామిలిటరీ రివల్యూషనరీ గార్డ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఐదు ఇరాన్ క్షిపణులను అడ్డుకుని ధ్వంసం చేసినట్లు జోర్డాన్ సైన్యం పేర్కొంది. సౌదీ అరేబియాపై జరిగిన డ్రోన్ దాడులకు ప్రతిస్పందనగా, అమెరికా, సౌదీ యుద్ధ విమానాలు తూర్పు ఇరాక్‌లోని పలు లాజిస్టిక్స్, ఆయుధ స్థావరాలపై దాడి చేశాయని అమెరికా సైన్యం ప్రకటించింది. తాము 'ఉద్రిక్తతను కోరుకోవడం లేదని, కానీ ఎలాంటి దురాక్రమణకైనా ప్రతిస్పందిస్తామని' సౌదీ రక్షణ మంత్రిత్వ శాఖ హెచ్చరించింది.



## వాళ్లంతా భారత్‌లాగే మాకు శత్రువులు

### పీఓకే ఉద్యమకారులనుద్దేశించి పాక్ రక్షణమంత్రి వ్యాఖ్య

ఇస్లామాబాద్: మెరుగైన జీవనం, పాలన, అవకాశాలు కోరుతూ ఉద్యమిస్తున్న పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)లోని ఉద్యమకారులపై పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం ఇస్లామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "పాక్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వాళ్లంతా భారత్‌లాగే మాకు బద్ధ శత్రువులు. ఉద్యమకారులతో చర్చలకు కూర్చునే ప్రసక్తే లేదు. వాళ్లంతా పాకిస్తాన్‌కు

- మిగతా 2వ పేజీలో



## 3 బరాజ్‌ల టెస్టింగ్

### ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ముందుకు..

కాపర్‌డ్యాంపై నిపుణులదే తుది నిర్ణయం

కాళేశ్వరంపై రేపు కీలక సమీక్ష

ఎస్ఎల్‌బీసీ, డిండి, పాలమూరును పూర్తిచేసి తీరుతాం

ఢిల్లీలో మీడియాతో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

హైదరాబాద్, జూలై 29: కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బరాజ్‌ల సామర్థ్య పరీక్ష లు నిర్వహిస్తున్నామని, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సూచనల మేరకు ముందుకెళ్తున్నామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన ఢిల్లీలో



## సమన్వయంతో ముందుకెళ్లాలి

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నద్ధత

డిప్యూటీ స్పీకర్ ఎన్నిక వాయిదాకు కారణం?

టీపీసీసీ సమావేశంలో కీలక చర్చ

తుంగతుర్తి పంచాయితీపై అధిష్ఠానం సీరియస్

హైదరాబాద్, జూలై 29: రాష్ట్రంలో పార్టీ బలోపే తం, ప్రభుత్వ-ం, పార్టీ మధ్య సమన్వయం, రానున్న ఎన్నికల వ్యూహాలపై కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టి సారించింది. ఇందులో భాగంగా తెలంగాణ రాజకీయ పరిణామాలు, స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధత, పెం డింగ్‌లో ఉన్న సంస్థాగత విషయాలు, తుంగతుర్తి నియోజకవర్గం పం చాయితీపై తెలంగాణ కాంగ్రెస్ కమిటీ సమన్వయ

- మిగతా 2వ పేజీలో

# సమన్వయంతో ముందుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి

**సమావేశం (టీపీసీ సీ) కీలకంగా చర్చించింది.**

వీటితోపాటు సర్ ప్రక్రియ, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక, వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం, నామినేటెడ్ పోస్టులతోపాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపైన చర్చ జరిగినట్టు సమాచారం. కాం గ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన బుధవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో టీపీసీసీ సమన్వ య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీ చంద్‌రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణలో సర్' ప్రక్రియ, పార్టీ – ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చించారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కోఆర్డినేషన్ కమిటీ పనితీరు, ఇప్పటివరకు తీసుకున్న నిర్ణయాల అమలుపై సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పార్టీ కార్యక్రమాల సమన్వయం, ప్రజలకు చేరువ చేసే కార్యాచరణపై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, సం స్థాగత బలోపేతం, రాజకీయ పరిస్థితులపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

**తుంగతుర్తి పంచాయితీపై అధిష్టానం సీరియస్..**

ఉమ్మడి నల్లగొండ జిల్లా తుంగతురి నియోజకవర్గ కాంగ్రెస్‌లో నెలకొన్న పరిణామాలను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధిష్టానానికి వివరించినట్లుగా తెలిసింది. ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన కామెంట్స్‌కు ప్రతిగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం, ఆ తర్వాత ఎమ్మెల్యే సామేలు చేసిన ప్రతి విమర్శలు పార్టీకి తీవ్ర నష్టం చేసే విధంగా ఉన్నాయని అభిప్రాయపడినట్లుగా తెలిసింది.

డిప్యూటీ స్పీకర్‌గా ఎమ్మెల్యే రాంచంద్రనాయక్ పేరును పార్టీ అధిష్టానం ప్రకటించిన తర్వాత ఎందుకు ప్రమాణస్వీకారం చేయించలేదని ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే ఆరా తీశారని తెలిసింది. డిప్యూటీ స్పీకర్ పదవీకి మరో వ్యక్తి పేరు ప్రతిపాదించాలని, అందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ కలిసి నిర్ణయం తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లుగా సమాచారం. ఇక హైదరాబాద్ మహబూబ్‌నగర్ నల్లగొండ పట్టభద్రులకు సంబంధించి రెండు ఎమ్మెల్సీ ఎన్నికలపైన ప్రత్యేకం గా ఫోకస్ పెట్టాలని, అందుకు పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులకు బాధ్యతలు అప్పగించాలని నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిసింది. వచ్చే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను కూడా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని, అన్నింటిలో విజయం సాధించాలని, అందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలనే నిర్ణయానికి వచ్చారు. ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల భర్తీతో పాటు పార్టీ పదవులు, టీ పీసీసీ వర్కింగ్ పోస్టులను కూడా సర్ ప్రక్రియ ముగిసిన తర్వాత భర్తీ చేయాలనే నిర్ణయం తీసుకున్నట్లుగా సమాచారం.

## వాళ్లంతా భారత్‌లాగే మాకు శత్రువులు

విరోధులే"అని అన్నారు. గత రెండ్రోజుల్లో పాక్ భద్రతా బలగాలు ఏకంగా 37 మంది ఉద్యమకారులను పొట్టనబెట్టుకున్నాయని ఉద్యమసంఘాల కూటమి 'జాయింట్ ఆవామీ యాక్షన్ కమిటీ(జేఏఏసీ)'బుధవారం ప్రకటించిన వేళ ఆసిఫ్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఓవైపు జేఏఏసీ బృందం తమతో చర్చలు జరిపిందని, 38 డిమాండ్లను తమ ఎదుట ఉంచిందని ప్రధానమంత్రి సలహాదారు రాణా సనావుల్లా ప్రకటించగా అందుకు భిన్నంగా రక్షణమంత్రి మాట్లాడటం గమనార్హం. పీఓకే శాసనసభ తొలి దశ ఎన్నికలు జరిగిన సోమవారం రోజు రావలకోట్ నుంచి ముజఫరాబాద్‌కు శాంతియుత ర్యాలీ చేస్తున్న తమపై పోలీసులు కాల్పులు జరిపి చిన్నారులు, మహిళలు సహా 37 మందిని చంపేశారని జేఏఏసీ తెలిపింది. "ఉద్రిక్తతకు దారి తీసిన ఈ ఘటనలో ఎవరూ చనిపోలేదు. గతంలో ప్రభుత్వం నుంచి సాయుధ శిక్షణ పొందిన పీఓకే వాసులు ఇప్పుడు ప్రభుత్వం మీదకు తుపాకీ గురిపెట్టారు"అని ప్రధానమంత్రి సలహాదారు రాణా సనావుల్లా వ్యాఖ్యానించారు.

## 3 బరాజ్‌ల టెస్టింగ్

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరంపై ఈనెల 31న కీల క సమీక్ష నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ), తెలం గాణ ప్రభుత్వం సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలా ముందుకెళ్లాలనే అంశంపై చర్చిస్తామని తెలిపారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బరాజ్‌లను పరీక్షిస్తున్నామని, ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో కలిసి రిహాబిలిటేషన్ డిజైన్ల పనులు పూర్తిచేస్తామని మంత్రి తెలి పారు. వీలైనంత త్వరగా మరమ్మతులు పూర్తి చేసి రైతులకు నీళు అందించేందుకు అన్ని ప్ర యత్నాలు చేస్తున్నామని పేర్కొన్నారు.

**నాసిరకం డిజైన్‌తోనే కాళేశ్వరం సమస్య**

కాళేశ్వరం సమస్యలకు గత ప్రభుత్వ నిర్లక్ష్య మే కారణమని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని విమర్శించారు. మట్టి న మూనాలపై సరైన పరీక్షలు నిర్వహించకుండా ఇసుక నేలపైనే పునాదులు వేశారని ఆరోపించారు. కొద్దికాలానికే లీకేజీలు వచ్చాయని, ఈ విషయం కేసీఆర్‌కు సైతం తెలుసన్నారు. తక్షణ మరమ్మతులు చేపట్టాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణారెడ్డి సహా అధికారులు సూచించి నా కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. గత మూడేళ్లుగా నిరూపయోగంగా ఉన్న ప్రాజెక్టుకు రూ. 16 వేల కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని మంత్రి తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చె ప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఫ్లోగా ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టం చేశారని తెలిపారు. కాపర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి పేర్కొన్నారు. కాళేశ్వరంపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. బరాజ్‌లు ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నాయని, వాటిని ఓపెన్ చేస్తే ప్రజలకు ఏమైనా జరిగే ప్రమాదం ఉంద ని, అందుకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి వస్తుందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. కాళేశ్వరంపై బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారమంతా బూటకమన్నారు. మేడిగడ్డ బరాజ్ నుంచి కన్నెపల్లి పంపుహౌస్ 18 కిలో మీటర్ల దూరం ఉం దని, అన్నారం బరాజ్‌కు రంధ్రాలు ఉన్నాయ ని సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చిందని, ఎన్‌డీఎస్ఏ మొదట ప్రిలిమినరీ నివేదికను నవంబర్ 23న ఇచ్చిందని మంత్రి గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని అక్రమాలు, అవినీతిపై సీబీఐ విచారణకు ఇస్తే కేంద్రం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన నిలదీశారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య బంధం ఉందన్నారు.

**కాళేశ్వరంలో అవినీతి జరిగిందని కవితనే చెప్పారు**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిందని కేసీఆర్ కూతురు కల్వకుంట్ల కవితనే స్వయంగా చెప్పారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కాళేశ్వరం కాంట్రాక్టర్లు రూ. 1,400 కోట్లు చెక్ రూపంలో బీఆర్ఎస్‌కు ఇచ్చారని కవిత చెప్పడం వాస్తవమన్నారు. తెలంగాణలో ధాన్యం కుంభకోణం చేసిన వారిని అరెస్టు చేస్తామని మంత్రి హెచ్చరించారు. తమ ప్రభుత్వం అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తుందని, ఎస్ఎల్‌బీసీ సొరంగం, డిండి, పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులను తమ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి ఎన్నికలకు వెళ్తామని స్పష్టం చేశారు.

# విద్యార్థులను హింసించే హక్కు ఎవరిచ్చారు

- మన విద్యార్థుల శరీరంలోకి
- పెల్లెట్లను దించారు
- సభలో అమిత్ షాపై రాహుల్ గాంధీ ఆగ్రహం
- విద్య ఖరీదైన వ్యాపారంగా, విద్యా వ్యవస్థ క్రూరంగా మారిందని ఆందోళన
- విద్యార్థుల అసలైన శత్రువు ఆర్‌ఎస్‌ఎస్ అని ధ్వజం



న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. నీట్ పేపర్ లీక్‌పై ఆందోళనకు దిగిన విద్యార్థులను కఠినంగా అణచివేయాలంటూ పోలీసులకు ఆదేశాలిచ్చారని ఆరోపించారు. నిరసనకారులపై పోలీసుల అరాచకాలు, కాల్పులకు అమిత్ షా ఆమోదం తెలిపారని మండిపడ్డారు. పేపర్ లీక్ సవరణ బిల్లుపై బుధవారం లోక్‌సభలో జరిగిన చర్చలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. బీజేపీని, ఆ పార్టీ మద్దతుదారులను పరోక్షంగా ఎద్దేవా చేశారు. ఇందుకోసం మూడు వర్గాలను ప్రస్తావించారు. విద్యార్థులు, తమకు అంతా తెలుసని భావిస్తూ దేవుడిలా నటించేవారు, ఆ రెండో వర్గమే సాక్షాత్తూ దేవుడని నమ్మే అంధభక్తులు ఉన్నారని విమర్శించారు. హోంమంత్రి అమిత్ షా భయపడుతున్నారని, అందుకే ఈ రోజు సభకు రాలేదని రాహుల్ అన్నారు.

విద్యార్థులపై హింసకు పాల్పడే హక్కు అమిత్ షాకు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఆయన మన విద్యార్థుల శరీరంలోకి పెల్లెట్లను(తుపాకీ గుళికలను) దించారని రాహుల్ ధ్వజమెత్తారు. దేశంలో విద్య నేడు ఖరీదైన వ్యాపారంగా, విద్యా వ్యవస్థ క్రూరంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు.

**ఆర్‌ఎస్‌ఎస్ గుప్పిట్లోకి విద్యా వ్యవస్థ**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)పై కూడా రాహుల్ తీవ్ర విమర్శలు గుప్పించారు. విద్యా వ్యవస్థను ప్రభావితం చేస్తూ, విద్యార్థులకు ఏమి బోధించాలనే దానిని ఆ సంస్థే నిర్దేశిస్తోందని ఆరోపించారు. విద్యా వ్యవస్థ ఆత్మను ఆర్‌ఎస్‌ఎస్ తన గుప్పిట్లోకి తీసుకుందని చెప్పారు. ధర్మేంద్ర ప్రధాన్ ఎప్పుడూ విద్యా శాఖను నడపలేదని, ఆ పని చేసింది ఆర్‌ఎస్‌ఎస్ మాత్రమేనని ఆక్షేపించారు. విద్యార్థుల అసలైన శత్రువు ఆర్‌ఎస్‌ఎస్ అని విమర్శించారు.

**అన్‌పార్లమెంటరీ పదం తొలగింపు**

కొంతమంది విద్యార్థులతో జరిపిన సంభాషణ యువత విద్య, జ్ఞానాన్ని ఎలా చూస్తుందనే దానిపై తనకు ఒక అవగాహన కల్పించిందని రాహుల్ అన్నారు. విద్యార్?థగా ఉండడం అంటే ఏమిటని తాను ఒక విద్యార్?థని అడిగానని చెప్పారు. అంటే కళాశాల లేదా పాఠశాలలో చదువుకోవడం, పుస్తకాలు చదవడం అని అర్థమా? అని అడిగితే.. విశాలమైన దృక్పథం, విశాలమైన హృదయం కలిగినవారే విద్యార్థి అని ఆమె సమాధానమిచ్చారని పేర్కొన్నారు.

"విద్యార్థి అంటే తనకు అన్నీ తెలియవని అంగీకరించే వ్యక్తి. తనకు తెలిసిన విషయాల స్థానంలో కొత్త జ్ఞానం వచ్చి చేరుతుంది. విశ్వం నిరంతరం పరివర్తన చెందుతూ ఉంటుందని అతనికి తెలుసు. జ్ఞానం కూడా నిరంతరం మారుతూ ఉంటుందని అతను అర్థం చేసుకుంటాడు. విద్యార్?థకి ఉండాల్సిన అత్యంత ముఖ్యమైన లక్షణం వినమ్రత అని ఆమె అన్నారు"అని రాహుల్ వెల్లడించారు. తమకు అన్నీ తెలుసని భావించే మరో వర్గం గురించి కూడా ఆమె వివరించారని పేర్కొన్నారు.

"తమకు అన్నీ తెలుసని కొందరు వ్యక్తులు దృఢంగా నమ్ముతారు. విశ్వం స్థిరమైనదని, జ్ఞానం తమ అంతరంగం నుంచే ఉద్భవిస్తుందని వారు భావిస్తారు. వారు అహంకారంతో ఉంటారు. వారు ఇతరుల మాట వినరు, సత్యాన్ని గౌరవించరు"అని చెప్పారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ ఉపయోగించిన ఒక పదంపై స్పీకర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యార్?థని తనతో చెప్పిన మాటలనే సభలో ప్రస్తావించానని, సభలోని ఏ సభ్యుడినీ ఉద్దేశించి అనలేదని రాహుల్ బదులిచ్చారు. రాహుల్ ఉపయోగించిన అన్‌పార్లమెంటరీ పదాన్ని రికార్డుల నుంచి తొలగించాలని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు కోరారు. దాంతో స్పీకర్ ఆ పదాన్ని తొలగించారు.

**ఎన్డీయే సభ్యుల తీవ్ర అభ్యంతరం**

సభలో రాహుల్ గాంధీ చేసిన ఆరోపణల పట్ల అధికార ఎన్డీయే సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. అరుపులు కేకలతో సభ దద్దరిల్లింది. దాంతో సభను రెండుసార్లు వాయిదా వేయాల్సి వచ్?చంది. రాహుల్ అబద్ధాల పుట్ట అంటూ బీజేపీ ఎంపీలు ఎదురుదాడికి దిగారు. ఆధారాల్లేకుండా ఆరోపణలు చేస్తున్నారని, అందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సైతం జోక్యం చేసుకున్నారు. ఇక్కడ చర్చ జరుగుతున్నది అమిత్ షాపై కాదని అన్నారు. ఆరోపణలకు ఆధారాలు చూపించాలని రాహుల్‌కు సూచించారు.

# బిల్లుకు సభ ఆమోదం

**సవరణ బిల్లు'కు సై**

- మూజువాణి ఓటుతో ఆమోదించిన లోక్‌సభ
- అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవడానికి ప్రభుత్వం సిద్ధం
- కేంద్ర సహాయ మంత్రి
- జితేంద్ర సింగ్ వెల్లడి
- బిల్లులో సవరణలు చేయాలన్న విపక్షాల వినతిని తిరస్కరించిన ప్రభుత్వం



న్యూఢిల్లీ: పేపర్ లీక్‌లను అరికట్టడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్(ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు--2026'ను లోక్‌సభ బుధవారం మూజువాణి ఓటుతో ఆమోదించింది. కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ సోమవారం బిల్లును సభలో ప్రవేశపెట్టగా, రెండు రోజుల సుదీర్ఘ చర్చ తర్వాత ఆమోదం పొందింది. నీట్ పేపర్ లీక్ కేసులో ప్రభుత్వం వేగంగా స్పందించిందని జితేంద్ర సింగ్ చెప్పారు.

2024లో పేపర్ లీక్ నిరోధక చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని తెలిపారు. గత కొన్నేళ్లుగా ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించిన ఆత్మహత్యల రేటు తగ్గిందని పేర్కొన్నారు. అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకే ఈ సవరణ బిల్లే నిదర్శనమని స్పష్టంచేశారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి పార్లమెంటరీ సంప్రదాయాలు, ప్రభుత్వ పనితీరుపై అవగాహన లేదని విమర్శించారు. బిల్లు ఆమోదం సందర్భంగా ప్రతిపక్షాలు నినాదాలు చేయడంపై జితేంద్ర సింగ్ విచారం వ్యక్తంచేశారు. దీనిపై తీవ్రంగా చర్చించి, సూచనలు ఇవ్వడానికి బదులుగా రాజకీయం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తప్పుపట్టారు. ప్రతిపక్ష నాయకుడి ప్రవర్తన చూసి ఆశ్చర్యపోయానని తెలిపారు. బిల్లు ఆమోదం పొందిన వెంటనే సభ మరుసటి రోజుకు వాయిదా పడింది. బిల్లులో పలు సవరణలు చేయా లని ప్రతిపక్షాలు సూచించినప్పటికీ ప్రభుత్వం అంగీకరించలేదు.

**ఏమిటీ సవరణ 7బిల్లు?**

2024లో తీసుకొచ్చిన పేపర్ లీక్ నిరోధక చట్టానికి సవరణ చేస్తూ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టింది.

పేపర్ లీకేజీలకు, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే దోషులకు ఐదేళ్ల నుంచి పదేళ్ల దాకా జైలు శిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధించేలా ఇందులో నిబంధనలు చేర్చారు.

వ్యవస్థీకృత నేరాలకు సంబంధించి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానాను ప్రతిపాదించారు.

ప్రతిపాదిత చట్టం కింద నేరాలను విచారించడానికి ఏదైనా సెషన్స్ కోర్టును ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టుగా నియమించే అధికారాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రాంతాలకు కల్పించాలని ఈ సవరణ బిల్లు సూచిస్తోంది.

అలాగే కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసిన తేదీ నుంచి మూడు నెలలలోపు విచారణను పూర్తి చేయాలని నిర్దేశిస్తోంది.

అవసరమైతే నేరంపై దర్యాప్తు చేయడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసే అధికారాన్ని కూడా కేంద్ర ప్రభుత్వానికి కల్పిస్తోంది.

చట్టం కింద నేరాలకు సంబంధించిన దర్యాప్తును రెండు నెలల వ్యవధిలోగా పూర్తి చేయాలని నిబంధన విధించారు.

కేసుల విచారణ కోసం ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రభుత్వ న్యాయవాదులను నియమించే అధికారాన్ని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కల్పించారు.

ఏదైనా తీర్పు, శిక్ష లేదా ఉత్తర్వుపై హైకోర్టులోని ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనానికి అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది. అప్పీల్‌ను స్వీకరించిన తేదీ నుంచి మూడు నెలల వ్యవధిలో దానిని పరిష్కరించాల్సి ఉంటుంది.

# మనకూ లీకులున్నాయ్!

- ఉమ్మడి ఏపీతో పాటు తెలంగాణలోనూ పలుమార్లు ప్రశ్న పత్రాల లీకేజీలు
- లక్షల మంది యువత కలలు ఛిద్రం
- కాక్రోచ్ ఉద్యమం ఓ హెచ్చరిక
- అప్రమత్తం కాకుంటే రాష్ట్రాలకూ ముప్పే



హైదరాబాద్, జూలై 29: పశ్నపత్రాల లీకేజీ ఇప్పుడు కేవ లం పరీక్షల నిర్వహణ లోపమే కాదు.. ప్రభుత్వాల విశ్వసనీయతకు సవాల్‌గా మారింది. ఒకప్పుడు పేపర్ లీక్ జరిగితే విచారణలతో సరిపెట్టిన పరిస్థితి ఉండ గా, ఇప్పుడు యువత నేరుగా ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ఉద్యమాలకు సిద్ధమవు తోంది. నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఢిల్లీలో జరిగిన భారీ నిరసనలే ఇందుకు నిదర్శనం. పరీక్ష ఎటువంటిదైనా లక్షలాది మంది విద్యార్థులు, అభ్యర్థులు, తల్లిదండ్రుల శ్రమ, కలలు, ఆశయాలు, ఆకాంక్షలతో ముడిపడి ఉంటాయన్న విషయం ప్రభుత్వాలు గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్ర దేశ్‌లోనే కాకుండా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తరువాత కూడా పలు పరీక్షల్లో ప్రశ్న పత్రాల లీకేజీ ఘటనలు చోటు చేసుకున్నాయి. ఢిల్లీ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకొని ఇకనుంచైనా పరీక్షలను పకడ్బందీగా, పారదర్శకంగా చేపట్టాల్సి ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. లేదంటే రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఉద్యమాలు జరిగినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం ఉండదని పలువురు అభిప్రాయపడు తున్నారు.

**గత అనుభవాలెన్నో..**

దేశవ్యాప్తంగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ పలు కీలక పరీక్షలు పేపర్ లీక్‌లతో రద్దయ్యాయి. ఎంసెట్, మెడికల్ ఎంట్రెన్స్ పరీక్షలు, ఇంటర్ మూల్యాంకన తప్పిదాలు, టీజీపీఎస్సీ గ్రూప్ పరీక్షల రద్దు వంటి ఘటనలు లక్షలాది మంది అభ్యర్థుల భవిష్యత్తును దెబ్బతీశాయి. ముఖ్యంగా టీజీపీఎస్సీ లీకేజీ వ్యవహారం రాజకీయంగానూ తీవ్ర ప్రభావం చూపింది. అయితే పోటీ పరీక్షలైనా, ప్రవేశ పరీక్షలైనా పకడ్బందీగా నిర్వహిస్తారనే భరోసా విద్యార్థులు, అభ్యర్థుల్లో కలిగేలా పరీక్ష నిర్వహణ చేపట్టి ఫలితాలను ప్రకటించాలి.

లేకుం టే ప్రభుత్వాలే తారుమారయ్యే పరిస్థితి ఉంటుంది. 1997లో కోల్‌కతకు చెందిన ప్రింటింగ్ సంస్థ నుంచి వైద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీక్ కాగా, 2009 మధ్యలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైద్య ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం లీక్, 2014లో ఆంధ్రప్రదేశ్ పీజీ మెడికల్ ఎంట్రెన్స్ టెస్ట్ ప్రశ్నపత్రం లీక్ కావడంతో వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. 2016లో ఎంసెట్ ప్రశ్న పత్రం లీక్ వ్యవహారంలో సీఐడీ ముగ్గురు నిందితులను అప్పట్లో అరెస్టు చేసింది. వీరు 30 మంది విద్యార్థులతో రూ.15 కోట్ల ఒప్పందం కుదుర్చుకుని ఢిల్లీలోని ఓ ప్రింటింగ్ ప్రెస్ నుంచి పరీక్షకు 48 గంటల ముందే పేపర్ బయటకు తెచ్చినట్లుగా సమాచారం. 2019లో ఇంటర్ పేపర్ మూల్యాంకనంలో గ్లోబరీనా సంస్థ చేసిన తప్పిదం కారణంగా 27 మంది విద్యార్థులు బీఆర్ఎస్ హయాంలో ఆత్మహత్య చేసుకున్నారు. అలాగే 2023లో టీజీపీఎస్సీ నిర్వహించే గ్రూప్ ప్రిలిమ్స్, ఏఈ, ఏఈఈ, డీఏవో, వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులు తదితర దాదాపు 15 వరకు పరీక్షలు లీకేజీ కారణంగా రద్దు అయ్యాయి. ప్రశ్న పత్రాలకు సంబంధించిన సమాచారాన్ని టీజీపీఎస్సీలో పనిచేసే ఓ వ్యక్తి ఏకంగా ప్రశ్నపత్రాలను పెన్‌డ్రైవ్‌లో కాపీ చేసుకోవడం అప్పట్లో పెద్ద సంచలనం గా మారింది. దీనిపై అప్పట్లో సిట్, ఈడీ విచారణ జరిపింది. ఒక్క గ్రూప్ దాదాపు 2.3 లక్షల మంది దరఖాస్తు చేసుకుంటే ఈఏఏకి 80 వేలు, మొత్తంగా 9 లక్షలకుపైగా అభ్యర్థులు రాసిన 8 పరీక్షలు రద్దు అయ్యాయి. అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు, నిరసనలు తెలిపారు. వీరికి రాజకీయ పార్టీలు సైతం మద్దతు ఇచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పరీక్ష సమయంలో టెన్త్ ప్రశ్నపత్రం వా ట్సాప్‌లో చక్కర్లు కొట్టడం కూడా రాజకీయంగా దుమా రం లేపింది. ప్రభుత్వాలకు గడ్డుకాలమే.. ఇన్ని ఉదాహరణలు కళ్లముందు జరుగుతున్నా ప్ర భుత్వాలు మాత్రం గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకున్నట్లు లేదు. ప్రతీసారి విచారణ జరుగుతోంది, కఠిన చర్యలు తీసుకుంటామనే మాటలతోనే సరిపెడుతున్నారు.

ప్రభుత్వాల్లో మార్పు రాకున్నా..యువతలో మా త్రం అప్పటికి ఇప్పటికీ మార్పు వచ్చింది. పేపర్ లీకైన గంటలోపే ట్విట్టర్‌లో ట్రెండ్ అవుతోంది. ఆధారాలతో సోషల్ మీడియాలో ప్రభుత్వాలను నిలదీస్తున్నారు. విద్యార్థి సంఘాలు రోడ్లపైకి వస్తున్నాయి. మా కష్టం కంటే లంచం పెద్దదా అని నేరుగా ప్రశ్నిస్తున్నారు. కోచింగ్‌కు అప్పులు చేసి, తల్లిదండ్రుల కష్టాన్ని పెట్టుబడి పెట్టి చదివిన పిల్లలకు ఇది కేవలం పరీక్ష కాదు. ఇది వారి జీవితం. ఆ జీవితంతో ఆడుకుంటే ఊరుకొబోమని చెప్పడానికే వాళ్లు తిరగబడుతున్నారు.

**టెక్నాలజీ తప్పనిసరి**

ప్రశ్న పత్రం ప్రింటింగ్ ప్రెస్ నుంచి పరీక్ష హాలు వరకు ఎక్కడో ఒక చోట లొసుగును ఆసరాగా చేసుకుని ప్రశ్న పత్రాలు లీక్ చేస్తున్నారు. పరీక్షల నిర్వహణ అంటే కేవలం హాల్ బుక్ చేసి, ఇన్విజిలేటర్‌ను పెట్టడం కాదు. ప్రశ్నపత్రాల ప్రింటింగ్ నుంచి పరీక్ష కేంద్రాల వరకు భద్రతను మరింత కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఉంది. పరీక్షకు తక్కువ సమయం ముందే ప్రశ్నపత్రాల ము ద్రణ, డిజిటల్ భద్రత, బాధ్యులపై కఠిన చర్యలు వంటి చర్యలు తీసుకుంటేనే లీక్‌లకు అడ్డుకట్ట పడుతుంది.



# రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంత్రుల పర్యటన

- మంత్రుల పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు.
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) జూలై 29

గురువారం రోజున వేములవాడ, సిరిసిల్ల లో మంత్రుల బృందం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈసందర్భంగా బుధవారం రోజున సాయంత్రం సిరిసిల్ల లోని రగుడు బై పాస్ జంక్షన్,బస్ షెల్టర్ ప్రాంతాలను, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో ట్యాంక్ బండ్ పార్క్ ప్రాంతాలను ఎస్పీ స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎస్పీ వెంట డిఎస్పీ లు నాగేంద్రచారి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు, సి.ఐ లు శ్రీనివాస్, వీరప్రసాద్, ఎస్.ఐ లు సిబ్బంది ఉన్నారు.



# సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా జాడి మహేశ్వర్

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్ )జులై 29

నా మీద నమ్మకం తో నన్ను మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సర్పంచ్ ఫోరం అధ్యక్షుడిగా,ఎన్నుకున్నందుకు బెల్లంపల్లి మండలంలోని 16 గ్రామ పంచాయతీల సర్పంచ్లకు పేరున ధన్యవాదాలు . అలాగే నా మిత్రులకు నా శ్రేయోభిలాషులకు పేరుపేరునా కృతజ్ఞులు గడ్డం వినోద్ నాయకత్వం వర్ధిల్లాలి మీ జాడి మహేశ్వర్ బుచ్చయ్యపల్లి సర్పంచ్ బెల్లంపల్లి సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షుడు.



# తాపీ సంఘం భవనంలో అర్రైవ్ అలైవ్ కార్యక్రమం

సైబర్ నేరాలు సీసీ కెమెరాలపై అవగాహన సదస్సు.

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 29

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని తాపీ సంఘం భవనంలో మంగళవారం బెల్లంపల్లి వన్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో ఎర్రివ్ అలివ్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ఎస్.హెచ్.ఓ, సి.ఐ కె. శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

**కార్యక్రమంలో చర్చించిన అంశాలు:**

1. సైబర్ క్రైమ్:బి ఓటీపీ , లింక్‌లు, లోన్ యాప్‌లు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. తెలియని నెంబర్ల నుండి వచ్చే కాల్స్, మెసేజ్‌లను నమ్మవద్దు.
2. సీసీ కెమెరాలు: నేరాల నివారణ మరియు శాంతిభద్రతల కోసం ప్రతి వ్యాపార సంస్థ, ఇళ్లు మరియు కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ప్రజలందరూ పోలీసులకు సహకరించి, అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాల గురించి వెంటనే 100, 1930 సైబర్ హెల్ప్‌లైన్ కు సమాచారం ఇవ్వాలని ఎస్ హెచ్ ఓ కోరారు.ఈ సందర్భంగా ఎస్ హెచ్ ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటి సమాజంలో పెరుగుతున్న సైబర్ నేరాలబి గురించి వివరించారు. ఫోన్‌కు వచ్చే తెలియని లింక్‌లు, ఓటీపీ లు అడిగే కాల్స్, ఆన్‌లైన్ లోన్ యాప్‌లు, పెట్టుబడుల పేరుతో జరిగే మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా సైబర్ మోసం జరిగితే వెంటనే 1930 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. అదేవిధంగా సీసీ కెమెరాల ప్రాముఖ్యత గురించి వివరిస్తూ, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, ఇతర నేరాల నివారణకు ప్రతి దుకాణం, ఇల్లు మరియు ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని కోరారు. దీని వలన పోలీసులకు నేరస్తులను పట్టుకోవడంలో సహాయపడుతుందని అన్నారు.



# కళ్యాణి ప్రాజెక్టు నుండి నీటి విడుదల

నిజాంసాగర్ /జులై 29( ప్రజా తీర్పు):

కళ్యాణి ప్రాజెక్టుకు నిండుకుండలా మారింది. బుధవారం ఉదయం 9 గంటలకు 430 క్యూసెక్కుల వరద ప్రవాహం చేరుతోంది. ఇందులో 250 క్యూసెక్కుల నీటిని ఫ్లడ్ గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తుండగా, 180 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువకు మళ్లిస్తున్నారు. కళ్యాణి డైవర్షన్ పథకం కావడంతో ప్రస్తుతం నీటి మట్టం 408.60 మీటర్లుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

# నేడు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రులు

- దాదాపు రూ.15.22 కోట్ల పనులను ప్రారంభించనున్న మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్.
- వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు నేడు శంకుస్థాపన.

(పాష సయ్యద్, ప్రజాతీర్పు వేములవాడ) జూలై 29



జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ పర్యటించ నున్నారు. దాదాపు రూ.15 కోట్ల 22 లక్షల నిధులతో పూర్తి చేసిన పనులను ప్రారంభించ నున్నారు. రూ. కోటి 65 లక్షలతో వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక చొరవ, నిరంతర పర్యవేక్షణతో ఈ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తయ్యాయి.ప్రణాళికాబద్ధంగా చేపట్టిన ఈ పనులు జిల్లాలో పర్యాటక, మౌలిక వసతుల అభివృద్ధికి మరింత దోహదపడనున్నాయి.

## ఆహ్లాదకరంగా గుడి చెరువు బండి పార్క్.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో బండ్ పార్క్ ఆహ్లాదకరంగా రూపుదిద్దుకుంది. మహా శివుడి విగ్రహం మరింత ఏర్పాటుతో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ నిధులు రూ. 12 కోట్లతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో బండ్ పార్క్ నిర్మాణ పనులు చేపట్టారు. గుడి చెరువు అభివృద్ధి పనులను గత ఆరు నెలల క్రితం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు ఆధ్యాత్మికత భావం ఉట్టిపడేలా, భక్తి భావం పెంపొందించేలా మహాశివుడి విగ్రహంతో పాటు, సప్తమాత్రికల విగ్రహాలు, అలాగే గుడి చెరువులో బోటింగ్ సదుపాయం ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యాటక శాఖ అధికారులు బండ్ పార్క్ లో 40 ఫీట్ల ఎత్తైన మహాశివుడి విగ్రహం, సప్తమాత్రికల విగ్రహాలు ఏర్పాటు చేశారు. గుడి చెరువులో బోటింగ్ సదుపాయం ఏర్పాటు చేసేందుకు పర్యాటక శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.బండ్ పార్క్ లో నటరాజ్ స్టాచ్యూ ఫౌంటెన్,సూర్య నమస్కార్, వాకింగ్ ట్రాక్, కోబుల్ స్టోన్ ఫ్లోరింగ్,ల్యాండ్ స్కేప్, అంఫ్లీ థియేటర్, తదితర పనులు పూర్తి చేసి ఆకర్షణీయ మొక్కలు నాటారు. సిరిసిల్ల ఖ్యాతిని మరింత చాటేలా ప్రత్యేక ఆకర్షణగా రగుడు బై పాస్ జంక్షన్. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఖ్యాతిని మరింత చాటేలా వస్త్ర ఉత్పత్తి దశలు అందరికీ అర్థం అయ్యేలా ఏర్పాటు చేసిన నమూనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేములవాడకు వచ్చే భక్తులు, పర్యాటకులు, వివిధ ప్రాంతాల ప్రజలు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో వస్త్ర ఉత్పత్తిలో వివిధ దశలను తెలుసుకునేలా ఏర్పాటు చేసిన నమూనాలపై హర్షం వ్యక్తం అవుతుంది. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పనులను పలుమార్లు పరిశీలించి వేగంగా.. ఆకర్షణీయంగా పూర్తి చేసేలా ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ఇరువైపులా రోడ్డును విస్తరింపజేశారు. అలాగే రోడ్డు భద్రతా చర్యల్లో భాగంగా సైన్ బోర్డ్స్ ఇతర భద్రతా చర్యలు తీసుకోవాలని రోడ్డు సేఫ్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు. రూ. 3 కోట్ల 10 లక్షలతో రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ లో భాగంగా బీటీ రోడ్డు విస్తరణ, హై మాస్ట్ లైట్లు, గ్రీనరీ, రోడ్డు భద్రత చర్యలు, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ లో వివిధ దశల నమూనాలు సిద్ధం చేశారు. ప్రత్యేక ఆకర్షణగా జోట (నాడే) నిలుస్తుంది. మోడల్ బస్ షెల్టర్స్. ప్రయాణికులు, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం, ఎస్పీ కార్యాలయం ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం రగుడు బై పాస్ జంక్షన్ వద్ద కరీంనగర్ రోడ్డులో.. కామారెడ్డి రోడ్డులో రూ. 12.50 లక్షలతో మోడల్ బస్ షెల్టర్స్ సిద్ధం చేశారు. అందరికీ ఎంతో ఉపయోగకరంగా అందుబాటులో ఉంది. నేడు వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు శ్రీకారం. కోటి 65 లక్షల రూపాయలతో వేములవాడ బస్టాండ్ పునర్నిర్మాణ పనులకు జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పనులకు గురువారం శంకుస్థాపన చేయనున్నారు. పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ఆఫీసు రూమ్స్, బస్ స్టాండ్ ఆవరణ సుందరీకరణ, పచ్చదనం పెంపు తదితర పనులు చేయనున్నారు.



# భారీ వర్షాల నేపథ్యంలో పలు వార్డులను సందర్శించిన మున్సిపాల్ చైర్పర్సన్ దావ స్వాతి

(వి వెంకటేష్ ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) జులై 29

నిన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి శాసనసభ్యులు,గడ్డం వినోద్ వెంకటస్వామి, ఆదేశాల మేరకు బెల్లంపల్లి మున్సిపాలిటీలోని బజార్ ఏరియా, పలు బస్తీలలో పర్యటించి భారీ వర్షాల కారణంగా ఇళ్ళు కూలిపోయిన బాధితులను పరామర్శించి, పడిపోయిన చెట్లను, నీరు నిలిచిన ప్రాంతాలను, డ్రైనేజీలను పరిశీలించి తక్షణ చర్యలు చేపట్టిన బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి.దావ స్వాతి రమేష్ బాబు మరియు బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్, మున్సిపల్ సిబ్బంది...పట్టణంలోని ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరి ప్రయాణికులకు, ప్రజలకు రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో మున్సిపల్ సిబ్బందిచే నాళాలను తెరిపించి వరద నీరు ఆగకుండా వెళ్లేలా చర్యలు తీసుకోవడం జరిగింది..అదేవిధంగా భారీ వర్షాలకు పలు బస్తీలలో భారీ వృక్షాలు నేల కూలడంతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా మున్సిపల్ సిబ్బందిచే వాటిని తొలగించేలా చర్యలు చేపట్టడం జరిగింది..వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, బస్తీలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవడం జరిగింది. డ్రైనేజీల పూడికతీత, వరద నీటి మళ్లింపు పనులను వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించడం జరిగింది..అత్యవసర సమయాల్లో మున్సిపాలిటీ అధికారులను, సిబ్బందిని సంప్రదించాలని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని వారు పేర్కొనడం జరిగింది..భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బెల్లంపల్లి పట్టణ ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని చైర్ పర్సన్ సూచించారు.. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రాగంశెట్టి సత్యనారాయణ, ఆయా వార్డ్ ల మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు..






# కొండగట్టు ఆంజనేయ స్వామి గిరిప్రదక్షిణలో పాల్గొన్న మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, ఎస్పీ

( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 29.

గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలోలిలి నిర్వహించిన గిరిప్రదక్షిణలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి లిపొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే లిలిమేడిపల్లి సత్యంలి జిల్లా కలెక్టర్ లిబి. సత్యప్రసాద్‌లి ఎస్పీ అశోక్ కుమార్ పాల్గొన్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులతో కలిసి ప్రజాప్రతినిధులు గిరిప్రదక్షిణ పూర్తి చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, శాంతి, సుభిక్షం కోసం ప్రార్థించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ కొండగట్టు ఆంజనేయ స్వామి మహిమ అపారమని, ప్రతి సంవత్సరం లక్షలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో గిరిప్రదక్షిణలో పాల్గొంటారని అన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గురు వ్యాస పౌర్ణమి సందర్భంగా కొండగట్టు గిరిప్రదక్షిణలో పాల్గొనడం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి వ్యవసాయ రంగం అభివృద్ధి చెందాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత పురోగతి సాధించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు కల్పించిందన్నారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణలోని అత్యంత పవిత్రమైన ఆంజనేయ క్షేత్రాల్లో కొండగట్టు ఒకటని అన్నారు. భక్తుల విశ్వాసానికి నిలయమైన ఈ క్షేత్రానికి ప్రభుత్వం అవసరమైన సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా కృషి చేస్తోందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రకృతి అనుకూలించి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వేలాదిగా భక్తులు పాల్గొనడం వారి అపారమైన భక్తికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ గురు వ్యాస పౌర్ణమి గిరిప్రదక్షిణకు విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసిందన్నారు. తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. వర్ష పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేశారని, భక్తులు సురక్షితంగా దర్శనం చేసుకునేలా అన్ని ఏర్పాట్లు కల్పించినట్లు వెల్లడించారు. భక్తుల సహకారంతో కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని తెలిపారు. ఈ ప్రదక్షిణలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, పూజరులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- మంత్రి శ్రీధర్ బాబుతో నూతన వైద్యుల భేటీ

మంథని, జూలై-29 (ప్రజాతీర్పు)

మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తెలంగాణ రాష్ట్ర వైద్య విధాన పరిషత్ ద్వారా ఇటీవల రెగ్యులర్‌గా నియమితులైన గైనకాలజిస్ట్ డాక్టర్ మామిడిపల్లి స్రవంతి, అనస్థీషియా స్పెషలిస్ట్ డాక్టర్ గుంట మౌనిక లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల మంథని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ టివి రాజశేఖర్ రెడ్డి మంత్రికి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో పాటు నూతనంగా బాధ్యతలు చేపట్టిన గైనకాలజిస్ట్, అనస్థీషియా స్పెషలిస్ట్ వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వైద్య సదుపాయాలను కల్పించిందని, వాటిని సద్వినియోగం చేసుకుంటూ ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా మాతాశిశు వైద్య సేవలను మరింత బలోపేతం చేసి, ప్రసూతి సేవల కోసం ఇతర



ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. మంథని, పరిసర గ్రామాల నుంచి వచ్చే గర్భిణీ కేసులను ఇతర ఆసుపత్రులకు రిఫర్ చేయకుండా, వీలైనంత వరకు మంథని ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స అందించి ప్రసవాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యులకు తెలిపారు. ఇటీవల మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో నియమితులైన డెంటల్ స్పెషలిస్ట్ డాక్టర్ పూర్ణిమ అందిస్తున్న దంత వైద్య సేవలను ఈ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఆసుపత్రి నిర్వహణలో లేదా వైద్య సేవల అందింపులో ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని వైద్యులకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని విధాలా సహకారం అందిస్తుందని పేర్కొన్నారు.

# శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో గురుపౌర్ణమి వేడుకలు

(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జిల్లా 29



స్థానిక శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో గురు పౌర్ణమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు, యజ్ఞం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గురుపరంపర వైభవాన్ని చాటి చెప్పే ఈ పవిత్ర దినాన విద్యార్థులు, ఆచార్యులు కలిసి గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. గురుపౌర్ణమి ఆషాఢ పౌర్ణమి రోజున జరుపుకునే భారతీయ సంప్రదాయంలోని ప్రముఖ పర్వదినం.ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, పులల శ్యామ్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ యజ్ఞంలో పాల్గొనగా జ్యోష్యం అనుదీప్ వేద మంత్రోచ్చారణలతో యజ్ఞం నిర్వహించారు. భారతీయ సంస్కృతి, గురు–శిష్య పరంపర గొప్పతనాన్ని ప్రతిబింబించేలా గురుపూజ నిర్వహించారు. యజ్ఞంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ దేశం, సమాజం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రార్థనలు చేశారు.ముఖ్య వక్త డాక్టర్ లెక్కల రాజభాస్కర్ రెడ్డి గురువు గొప్పతనం, భారతీయ సంస్కృతిలో గురువు స్థానాన్ని విశదీకరిస్తూ ప్రసంగించారు. గురువు కేవలం విద్యను బోధించే వ్యక్తి మాత్రమే కాకుండా, విద్యార్థి వ్యక్తిత్వ వికాసానికి మార్గదర్శి అని పేర్కొన్నారు. మన సంస్కృతిలో "గురు బ్రహ్మ, గురు విష్ణు, గురు దేవో మహేశ్వరః" అనే భావనకు ఉన్న విశిష్టతను వివరించారు. విద్యార్థులు గురువుల పట్ల వినయం, క్రమశిక్షణ, గౌరవ భావాలను పెంపొందించుకోవాలని, గురువులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆయన సూచించారు. భారతీయ గురు–శిష్య పరంపర విశిష్టతను ఉదాహరణలతో వివరిస్తూ, గురు పూజ ద్వారా గురువుల పట్ల కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేయడం ప్రతి విద్యార్థి బాధ్యత అని అన్నారు. అనంతరం విద్యాపీఠం ప్రశిక్షణ వర్గలో ఉత్తీర్ణత సాధించిన ఆచార్యులందరికి ధ్రువీకరణ పత్రం అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ , ఆచార్యులు, విద్యార్థులు పాల్గొని గురువులకు పుష్పాంజలి ఘటించి వారి ఆశీర్వాదాలు పొందారు.



# పదోన్నతి పొందిన ఎస్.ఐ వెంకటేశ్వర్లుకు ఎస్పీ అభినందనలు

( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 29.

జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహించి ఎస్.ఐ గా పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ వెంకటేశ్వర్లుకు ఎస్‌ఐ హోదాకు సంబంధించిన స్టార్ చిహ్నాన్ని అలంకరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాకుండా బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయని అన్నారు. పెరిగిన బాధ్యతలను క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం, గౌరవం మరింత పెరిగేలా విధులు నిర్వర్తించాలని సూచించారు.

# ఘనంగా సి నా రే 99వ జయంతి వేడుకలు...

( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) జూలై 29.



జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, తెలంగాణ సాహితీ శిఖరం స్వర్గీయ సి. నారాయణరెడ్డి 99 వ జయంతి సందర్భంగా కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం జగిత్యాల అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో బుధవారం సి నా రే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశ్రీ అధినేత గుండేటి రాజు మాట్లాడుతూ సి నా రే సాహిత్యం అజరామరం అని ప్రపంచ సాహిత్య పుటల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, ఆయన సాహిత్యం ముందు తరాలకు ఆదర్శంగా నిలుస్తాయాని, ఇప్పటికి సి నా రే గజల్స్ శ్రోతలను అలరిస్తున్నాయని పేర్కొన్నారు. కవులు సి నా రే పై కవితాగానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉజగిరి జమున, కవయిత్రులు అయిత అనిత, మద్దెల సరోజన, లక్కరాజు శ్రీలక్ష్మీ, ములస్థం లావణ్య, కటుకం కవిత, మాడిశెట్టి శ్రీనివాస్, ఓదెల గంగాధర్, డా. శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.



# అంగన్వాడి పోస్టులలో అన్ని రకాల వికలాంగులకు పోస్టులను సమానంగా నోటిఫికేషన్ వేయండి

(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) జూలై 29

మహిళ వికలాంగుల సాధికారత సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ శిశు సంక్షేమ శాఖ, ట్రాంజెండర్ దివ్యాంగుల ప్రిన్సిపాల్ సెక్రటరీ శృతి ఓజాని కలిసి అంగన్వాడి పోస్టులలో ఓహెచ్, హెచ్ హెచ్, విహెచ్ వాళ్లకు అందరికీ సమానంగా పోస్టులను వేయమని కోరడం జరిగింది. మేడం తప్పకుండా పంచాయతీరాజ్ సమి? మంత్రి సీతక్క కి ఫైలు పెట్టి వెంటనే మరల నోటిఫికేషన్ వేస్తామని హామీ ఇచ్చారు. ఎస్ ఆర్ డి బ్లాక్ లాక్ పోస్టులు త్వరలో జీవో వస్తుందని వివరించారు. మహిళా సాధికారత సంఘం అధ్యక్షురాలు కోల రాజ్యలక్ష్మి, సెక్రటరీ స్వప్న, మహిళ నాయకురాలు దానమ్మ, ఉస్మానియా యూనివర్సిటీ పోరం చంద్రశేఖర్, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు డాక్టర్ అశోక్, మరుగుజ్జుల సంఘం ఉపాధ్యక్షుడు సైదులు యాదవ్ పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

( కుమారస్వామి ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) జూలై 29

గ్రామాల సమగ్ర అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి గ్రామంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన గ్రామ, మండల అభివృద్ధి కార్యక్రమాల సమీక్షా సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామ పంచాయతీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సర్పంచులు, అధికారులను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి తక్షణమే పరిష్కరించాలని, అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నిర్లక్ష్యం ఉండరాదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

# గురు పౌర్ణమి సందర్భంగా శ్రీ సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

(వినోద్, ప్రజా తీర్పు మల్కాజిగిరి మేడ్చల్ జిల్లా ప్రతినిధి) జులై 29



గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం మల్కాజ్‌గిరి సాయి నగర్‌లోని శ్రీ సాయి బాబా దేవాలయంలో శ్రీ సాయి సమాజం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ సాయిబాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. గురువు మార్గదర్శకత్వం సమాజ నిర్మాణానికి ఎంతో అవసరమని, భారతీయ సంస్కృతిలో గురువుకు అత్యున్నత స్థానం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు కల్పన, మమతా రెడ్డి , మాజీ కార్పొరేటర్ మేకల సునీత, రాము యాదవ్, శిరీష జితేందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వీరేశం యాదవ్, మల్లేష్ గౌడ్, లింగారెడ్డి, శ్రీ అశోక్, బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి,జేపీసీ వెంకన్న, మురిగేష్, నర్సింగరావు, శ్రీరాములు, కిట్టు, శ్రీ రాములు చంద్ర మౌళి, బాలకృష్ణ, స్థానిక భక్తులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీరాంపూర్ : గురు పౌర్ణిమ సందర్భంగా సాయిబాబాను దర్శించుకున్న మేయర్ దర్ని మధుకర్ :

(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు, మంచిర్యాల)జూలై 29

గురు పౌర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకొని మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అర్ కె 8 కాలనీలో గల సాయిబాబా మందిరంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్ ,టీపీసీసీ సభ్యులు నూకల రమేష్ తో కలిసి సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించి సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా గురు పౌర్ణిమ ఆధ్యాత్మికత, సేవాభావానికి ప్రతీక అని పేర్కొన్న మేయర్ దర్ని మధుకర్ ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏడవ డివిజన్ కార్పొరేటర్ వేల్పుల రవీందర్, మరియు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చిలుక మల్లేష్,స్థానిక కాంగ్రెస్ నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



# అహ్మద్‌గూడ 2BHK ఫేజ్-2లో వైభవంగా 'వనమహోత్సవం'

( వినోద్, ప్రజా తీర్పు, మేడ్చల్ జిల్లా ప్రతినిధి) జులై 29:

అహ్మద్‌గూడ 2బి ఎచ్ కె ఫేజ్–2 లో మెయిన్ కమిటీ చైర్మన్ రజిని శ్రీహరి గౌడ్ ఆధ్వర్యంలో 'వనమహోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ?ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ రామలింగం, డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్, డిప్యూటీ మేనేజర్ దుర్గ, సూపర్ వైజర్ మల్లేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారుల చేతుల మీదుగా 17 బ్లాక్‌ల చైర్మన్లకు మరియు లబ్ధిదారులకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 24 నుండి 40 వరకు ఉన్న బ్లాక్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు కోరారు.

# వరుణయాగ ఏర్పాట్లను పరిశీలించిన గౌరవ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీ శ్రీనివాస్

- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం

(నారుకట్ల మధు ప్రజాతీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ, జూలై 29)



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో లోకకల్యాణార్థం, సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పిస్తూ మూడు రోజులపాటు నిర్వహించనున్న వరుణయాగం ఏర్పాట్లను ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు శ్రీ ఆది శ్రీనివాస్ గారు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని ఏకాంతంగా నిర్వహించనున్నారు. అలాగే ఈ నెల 30వ తేదీ గురువారం నుంచి ఆగస్టు 1వ తేదీ శనివారం వరకు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో సత్వర సద్యఃసువృష్టి (సకాల వర్షప్రాప్తి) కోసం ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహించనున్నారు. జూలై 30వ తేదీ గురువారం ఉదయం స్వస్తి పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణ జపాలు, సంతత ధారాభిషేకం, వరుణయాగ హోమం, జపానుష్ఠానాలు నిర్వహించబడనున్నాయి. అదేవిధంగా దేవస్థానం పరివార, అనుబంధ ఆలయాల్లో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, విరాటపర్వ పారాయణాలు, ప్రవచన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పటి నుంచి ప్రారంభమయ్యే వరుణయాగ మహోత్సవాలకు హాజరయ్యే భక్తులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు ఆదేశించారు. అనంతరం శ్రీ భీమేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మండపంలో వేద పండితులు, ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ ఈవో శ్రీమతి రమాదేవి గారు స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని కోడెలకు పచ్చిగడ్డి, కోతులకు అరటిపండ్లు తినిపించారు. రానున్న మూడు రోజులపాటు నిర్వహించనున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో నవీన్ కుమార్, ఏఈఓలు జయకుమారి, నాగుల మహేష్, లక్ష్మణరావు, పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ, నరేందర్, పెరిక శ్రీనివాస్, శివసాయి సీనియర్ అసిస్టెంట్ వంశీ మోహన్ శర్మ నక్క తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు పనిచేయాలి

మండల సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

(పొనకంటి ఉపేందర్ రావు ప్రజా తీర్పు) జులై 29



టేకులపల్లి :ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై సమగ్ర సమీక్ష అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్యముఖ్య అతిథిగా హాజరై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లిఇందిరమ్మ ఇళ్ల పథకంనిర్మాణాల పురోగతిపై అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా చూడాలని అన్నారు.ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీరామ్ తహసీల్దార్, ఎంపీడీవో, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గౌరారం జీపీ ఆవరణలో టేకు చెట్ల విక్రయంపై సమగ్ర విచారణ జరపాలి

- జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన గ్రామ ప్రజలు

**( పగడాల.రామారావు. ప్రజా తీర్పు బయ్యారం మండల ప్రతినిధి )జులై 29**



బయ్యారం స్థానిక మండలం పరిధిలోని గౌరారం గ్రామ ప్రజలు గత కొద్ది రోజులుగా గ్రామపంచాయతీ ఆవరణలో ఉన్న టేకు చెట్ల గురించి సమగ్రామైన విచారణ జరపాలని ప్రజలే విలేకర్ల సమావేశం ఏర్పాటు చేయడం చూస్తుంటే, గ్రామపంచాయతీ పాలకవర్గంపై అనేక సందేహాలు సంకుచిత భావనలు కనిపిస్తున్నాయని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు అందులో భాగంగా గౌరారం గ్రామపంచాయతీ అంశంపై పలువురు ప్రజలు మాట్లాడుతూ, గౌరారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న విలువైన టేకు చెట్లను అప్పటి స్పెషల్ ఆఫీసర్ అయిన బయ్యారం ఎఫ్ఆర్ఓ ఆధ్వర్యం లో కొత్త గ్రామ పంచాయతీ నిర్మాణం కోసం నరికించటం జరిగింది. నరికించిన వాటి విక్రయానికి సంబంధించిన వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు , జిల్లా అటవీ శాఖ అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేయడం జరిగిందని, ప్రజలు తెలియజేశారు. ఈ విషయంలో గౌరారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న టేకు చెట్లను నరికించి డంప్ చేసిన టేకు చెట్లను విక్రయించిన వ్యవహారంలో తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రస్తుత సర్పంచ్ లలిత గారు సోషల్ మీడియాలో పేర్కొనడం తమకు ఆశ్చర్యం కలిగించిందని, సర్పంచ్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఆస్తులు, చెట్లు, భవనాలు తదితర ప్రజా ఆస్తుల పరిరక్షణ బాధ్యత గ్రామపంచాయతీ పాలకవర్గంపై ఉంటుందని, అందువల్ల టేకు చెట్ల విక్రయంకు సంబంధించిన పూర్తి వివరాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలోని టేకు చెట్లను చెట్లను ఎక్కడికి తరలించారు? వాటిని ఎవరికీ విక్రయించారు? విక్రయం ద్వారా వచ్చిన నగదు ఎంత? ఆ నగదు గ్రామపంచాయతీ అధికారిక ఖాతాలో జమ అయిందా? లేకపోతే ఎందుకు జమ కాలేదు? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. టేకు చెట్లను నరికివేసి గోలోజు కరుణాకర్‌కు విక్రయించినట్లు తాము అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, ఈ వ్యవహారంలో గ్రామపంచాయతీకి రావాల్సిన ఆదాయం పంచాయతీ ఖాతాలో జమ చేయలేదన్నది తమ ప్రధాన ఆరోపణ అని తెలిపారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాల్సిన అవసరం ఉందని అలాగే, గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టర్‌కు టేకు చెట్ల నరికివేత, విక్రయాలతో ఎలాంటి సంబంధం లేదని, కాబట్టి కాంట్రాక్టర్‌పై ఆరోపణలు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. అసలు టేకు చెట్లను ఎవరు తరలించారు? ఎవరు విక్రయించారు? విక్రయించిన మొత్తం ఎక్కడ జమ చేశారు? అనే పూర్తి వివరాలు గ్రామపంచాయతీ కార్యదర్శి రవి , సంబంధిత అధికారులను విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, తాము గ్రామపంచాయతీకి చెందిన విలువైన చెట్ల నరికివేత, విక్రయాలపై ప్రశ్నలు లేవనెత్తినందుకు తమపై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ గారికి, జిల్లా అటవీ శాఖ అధికారులకు ఆధారాలతో ఫిర్యాదు చేశామని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలోని టేకు చెట్ల నరికివేతపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. విచారణలో అక్రమాలు లేదా అవినీతి జరిగినట్లు తేలితే, బాధ్యులైన వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో, గ్రామపంచాయతీకి చెందిన ప్రజా ఆస్తులు భవిష్యత్తులో ఎలాంటి దుర్వినియోగానికి గురికాకుండా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ వ్యవహారంపై తాము అధికారులకు ఫిర్యాదు చేసినందుకు తమపై వ్యక్తిగత ఆరోపణలు చేయడం ద్వారా అసలు విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేయకుండా, సంబంధిత వ్యక్తులు కూడా విచారణకు సహకరించాలని కోరారు. నిజానిజాలు అధికారుల విచారణలోనే తేలాలని, గౌరారం గ్రామ ప్రజలకు పూర్తి వాస్తవాలు తెలియాల్సిందేనని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో గౌరారం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ముక్తి పుల్లయ్య,కాంగ్రెస్ పార్టీ నాయకులు తాడబోయిన ప్రభాకర్ యాదవ్,సల్వాది సారయ్య,ఆవుల లింగయ్య, భూక్యా రమేష్, బోడ సుమన్,కస్తూరి సుధాకర్,కోడి బుచయ్య,కేశోజు వెంకటాచారి,అఖిల్,ఆలేటి మహేష్, సదానందం కొమ్మనబోయిన,శ్రీపతి ఉపేందర్,బాధవత్ మామోజి,బానోత్ శ్రీకాంత్,బాధవత్ శంకర్,ముంత నరేష్, వారే నాగయ్య,తరాల సమ్మయ్య, దుస్స నరేశ్ నర్రా సంతోష్ పాల్గొన్నారు...

# గిరిజన విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 29 (ప్రజా తీర్పు)**

తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గరిమెళ్లపాడు, చంద్రుకుంట ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న గిరిజన పేద విద్యార్థులకు బుధవారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. సంఘం కార్యదర్శి సురేష్ కుమార్ మిత్రులు రఘురాం, లలిత (అమెరికా) ఆర్థిక సహకారంతో సుమారు రూ.10 వేల విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, షార్పనర్లు, అంగన్‌వాడీ చిన్నారులకు పలకలు, బలపాలను మొత్తం 75 మంది విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు కొల్లు నాగేశ్వరరావు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా గరిమెళ్లపాడు పాఠశాల విద్యార్థులకు బూట్లు, బ్యాగులు, గుర్తింపు కార్డులు, టైలు అందజేస్తున్నామని తెలిపారు. గరిమెళ్లపాడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతారాములు సూచన మేరకు తొలిసారిగా చంద్రుకుంట పాఠశాలలో మూడు గుత్తికోయ గ్రామాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేయడం ఆనందంగా ఉందన్నారు. సంఘం కార్యదర్శి సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు అందించిన విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. గరిమెళ్లపాడు, చంద్రుకుంట పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సీతారాములు, కిరణ్మయి సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు అంజనానందం, జోసెఫ్, గరిమెళ్లపాడు గ్రామ సర్పంచ్ రాము, ఉపసర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్ల సేవలను అభినందిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు.



# 26 ఏళ్ల నిజాయితీ సేవకు ఉద్యోగ విరమణ

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 29 (ప్రజా తీర్పు)**

పాఠశాలలో అటెండర్‌గా 26 సంవత్సరాల పాటు నిజాయితీ, నిబద్ధత, అంకితభావంతో సేవలందించిన కాశీమాల లక్ష్మీనర్సు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, బంధువులు, ఆత్మీయులు కలిసి లక్ష్మీనర్సును ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. సుదీర్ఘ సేవా కాలంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఆప్యాయంగా మెలుగుతూ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి అందరి అభిమానాన్ని చూరగొన్నారని పలువురు కొనియాడారు. విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణకు ఆయన ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు కుటుంబ బాధ్యతలను కూడా సమర్థంగా నిర్వర్తించిన లక్ష్మీనర్సు కుమార్తెకు వివాహం జరిపించి, కుమారుడిని ఇంజనీరింగ్ చదివించి ప్రయోజకుడిగా తీర్చిదిద్దారని తెలిపారు. కుటుంబం కోసం ఎన్నో త్యాగాలు చేసి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసిన ఆయన జీవితం ఆదర్శప్రాయమని పలువురు అభిప్రాయపడ్డారు. ఉద్యోగ విరమణతో విధులకు మాత్రమే వీడ్కోలు పలికారని, లక్ష్మీనర్సుతో తమకున్న అనుబంధం, ఆయన అందించిన సేవలు ఎప్పటికీ మరువలేమని ఉపాధ్యాయులు, విద్యార్థులు, బంధువులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ జర్నలిస్టు, తెలంగాణ క్రైమ్ రిపోర్టర్, బీసీ సంఘాల వర్కింగ్ ప్రెసిడెంట్ కురిమెళ్ల శంకర్ లక్ష్మీనర్సును ఘనంగా సన్మానించి ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో కుటుంబ సభ్యుల మధ్య ఆనందంగా గడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు దాసరి సాంబశివరావు, నర్సింగోజ్, విష్ణువర్ధన్, ప్రభాకర్ తదితరులు పాల్గొని లక్ష్మీనర్సుకు శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులు లాభసాటి పంటల సాగుపై దృష్టిసారించాలి

మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు.

**(పగడాల రామారావు ప్రజా తీర్పు గార్ల మండల ప్రతినిధి )జూలై 29**



గార్ల. స్థానిక మండల పరిధి చిన్న బంజర పంచాయతీ. గ్రామసర్పంచ్ మోతిలాల్ అధ్యక్షతన బుధవారం ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో మండల మండల వ్యవసాయాధికారి కావటి రామారావు మాట్లాడుతూ రైతులు లాభసాటి పంటల సాగుపై దృష్టి పెట్టాలని రైతు అవగాహన సదస్సులో సూచించారు.. రైతులు ప్రస్తుత వాతావరణ పరిస్థితి ని అవగాహన చేసుకొంటూ వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు మేరకు పంటల పై యాజమాన్య పద్ధతులు చేపడితే అధిక దిగుబడులు సాధించ వచ్చు నని కూరగాయలు సాగు వలన నిరంతరం ఆదాయం లభిస్తుందని పప్పు ధాన్యాల సాగు వలన బూసారం పెరుగుతుందని రైతుకు నికర ఆదాయం లభిస్తుందని సాగులో మెలకువలను పాటించాలని రసాయన ఎరువులు మితం గా వాడుతూ సేంద్రియ ఎరువులను ఉ జీవన ఎరువులను క్రమ పద్ధతిలో వినియోగించాలని వరి మగాణలలో నీటి లభ్యత తక్కువ గా ఉండటం వలన పెసర సాగు చేపట్టాలని రైతులను కోరారు... పచ్చి రొట్ట సాగు చేసిన రైతులు సకాలంలో భూమిలో కలియ దున్ని సింగిల్ సూపర్ పాస్పేట్ ను వేయాలని తద్వారా రొట్ట మురిగి భూమికి బలం చేకూరుతుంది అని ఆఖరి దుక్కి లో జింక్ సల్ఫేట్ ను వినియోగించడం ద్వారా జింక్ లోపాన్ని నివారించడం తో పాటుగా ఇతర పోషకాలు సమర్థవంతం గా మొక్క తీసుకొనే విధంగా తొడ్పాడుతుందని సూచించారు.. ఈ కార్యక్రమం లో ఏఈఓ పూజిత గ్రామ ఉప సర్పంచ్ వార్డ్ మెంబెర్స్ రైతులు పాల్గొన్నారు

# దివ్యాంగుల సంక్షేమ వ్యవస్థను బలోపేతం చేసేందుకు దివ్యాంగుడిని కమీషనర్ గా నియమించాలి

- టి ఆర్ వి ఎస్ ( తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి) రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ మున్నా

**(మొక్క ఉపేందర్ ప్రజాతీర్పు ప్రతినిధి హైదరాబాద్) జూలై, 29**



దివ్యాంగుల సంక్షేమాన్ని బలోపేతం చేయడానికి దివ్యాంగుడిగా ఉన్న వ్యక్తినే తెలంగాణ వికలాంగుల సంక్షేమ శాఖసంచాలకులుగా నియమించాలని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ మున్నా డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నాడు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ మా పోరాటం ఏ ఒక్క వ్యక్తి పైన కాదని దివ్యాంగుల సంక్షేమ వ్యవస్థను బలోపేతం చేయడానికి స్పష్టం చేశారు. తమకు ఎవరిపై వ్యక్తిగత ద్వేషం కానీ కోపం కానీ లేదని దివ్యాంగుల సంక్షేమానికి సంబంధించిన విధానాలు శాఖ పనితీరు పైనే తన అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. గతంలో కమిషనర్ గా పనిచేసిన వ్యక్తి దివ్యాంగుల సంక్షేమంపై ఎలాంటి ప్రత్యేక చర్యలు తీసుకోకపోవడమే కాక ఎలాంటి కేసులను పరిష్కరించలేదని ఇప్పటికీ ఆమెపై తమకు ఎలాంటి వ్యక్తిగత విరోధం లేదు కానీ మళ్లీ ఆమెనే తీసుకొని రావాలని ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకుంటున్నామని అన్నారు. దివ్యాంగుల సంక్షేమ శాఖలో బ్యాక్లాగ్ ఉద్యోగాల భరితి దివ్యాంగుల నైపుణ్య అభివృద్ధి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ఉపాధి అవకాశాలు కల్పనా ప్రత్యేక పాఠశాలల అభివృద్ధి వంటి అనేక కీలక అంశాలలో ఆశించిన పురోగతి కనిపించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని మీడియా కథనాల్లో కమిషనర్ శైలజని మళ్లీ కమిషనర్ గా తేవాలని, ఆలోచనలు జరుగుతున్నట్లు సోషల్ మీడియాలో వస్తున్న కథనాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయని ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా విచారణ జరిపి తగిన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం కమిషనర్ పదవికి గ్రూప్ 1 అధికారిని నియమించాలి అనుకుంటే ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ఇన్చార్జి కమిషనర్ గా నియమించి దివ్యాంగుల సంక్షేమ రంగంలో అనుభవం ఉన్న ఇద్దరు డిప్యూటీ కమిషనర్లను నియమించాలని సూచన చేశారు. అదేవిధంగా దివ్యాంగుల హక్కుల కోసం పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థలు దివ్యాంగుల సంఘాల ప్రతినిధులకు ప్రభుత్వ విధానాన్ని నిర్ణయాలలో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. దివ్యాంగుల సంక్షేమ శాఖలో పారదర్శకత జవాబుదారీతనం సమర్థవంతమైన పరిపాలన నెలకొల్పి దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి మహమ్మద్ మున్నా విజ్ఞప్తి చేశారు. మా ఈ విజ్ఞప్తిని మన్నించి సీనియర్ ఐఏఎస్ అధికారి మంచి అనుభవం ఉన్న వ్యక్తిని ఈ శాఖకు కమిషనర్ గా చేస్తే శాఖలో అభివృద్ధి పరుగులు పెడుతుందని అందుకు రాష్ట్ర దివ్యాంగుల శాఖకు ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్, చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.



# గురువులను పూజించే సంస్కారం నేర్చుకోవాలి

కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జులై 29**

గురువులను పూజించే సంస్కారాన్ని ప్రతీ ఒక్కరూ నేర్చుకోవాలని కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్ పేర్కొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా బుధవారం కరీంనగర్ కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా వ్యాస భగవానుని చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనగావించి గురుపౌర్ణమి వేడుకలు నిర్వించారు. అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ ఏ రంగం లోనైనా రాణించాలంటే గురువు తప్పనిసరని తెలిపారు. న్యాయవాద వృత్తిలో రాణించాలనుకునే వారంతా కూడా ఒక మంచి గురువును ఎంచుకుని వృత్తిలో నిష్ణాతులు కావాలని సూచించారు. న్యాయవాద వృత్తిలో 50 ఏళ్ల ప్రాక్టీస్ పూర్తి చేసుకున్న హన్మంతరావు,జీ నారాయణ రెడ్డి, కే మాదవరావు , కల్వకుంట్ల మనోహర్ రావ్ లను శాలువాలతో సన్మానం చేసి జ్ఞాపిక ను అందించారు.ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు బొడ్ల గీతారాణి, బండ శివకుమార్, సాంస్కృతిక కార్యదర్శి బెజ్జంకి శ్రీకాంత్, జాయింట్ సెక్రెటరీ సుంకె దేవకిషన్, కమిటీ సభ్యులు మూడపల్లి అనురాద, చెల్లోజు భూమాచారి, బొజ్జ స్వామి కరుణశ్రీ, సీనియర్ న్యాయవాదులు కుసుంబ కృష్ణారావ్, తుమ్మనపల్లి లక్ష్మణ్ రావ్,కూర శ్రీనివాస్ రెడ్డి, తిరునగరి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 31న చర్లపల్లిలో పౌర హక్కుల దినోత్సవం

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) జులై 29 :**

ఈనెల 31న శుక్రవారం ఎండపల్లి మండలంలోని చర్లపల్లి గ్రామంలో అంటరానితనం నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించడానికి పౌర హక్కుల దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎండపల్లి మండల తహసీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలపై అంటరానితనం నిర్మూలనతో పాటు పౌర హక్కుల పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే దిశగా అధికారులు పనిచేయాలని, ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, అంబేద్కర్ యువజన సంఘం, ఆయా దళిత సంఘాల నాయకులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులంతా హాజరై విజయవంతం చేయాలని తహసీల్దార్ అనిల్ కుమార్ కోరారు.

# ఎల్లంపల్లి నుంచి వరద కాలువకు సాగునీటి విడుదల

పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**రామడుగు, జూలై 29 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని చొప్పదండి నియోజకవర్గంలోని రైతులకు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలనే ఉద్దేశంతో చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు అధికారులు స్పందించి రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామ పరిధిలోని గాయత్రి పంప్‌హౌస్ నుంచి చొప్పదండి నియోజకవర్గంలోని దిగువ ప్రాంతాలకు బుధవారం వరద కాలువ ద్వారా సాగునీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం స్వయంగా హాజరై సాగునీటికి పూజలు నిర్వహించి నీటి విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించారు. నీరు దిగువ ప్రాంతాలకు చేరుతుండటంతో ఆయా ప్రాంతాల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పంటల సాగుకు ఈ నీరు ఎంతో ఉపయోగపడుతుందని రైతులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సాగు సీజన్‌లో రైతులకు సమయానికి నీరు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వరద కాలువ ద్వారా దిగువ ప్రాంతాలకు నీరు చేరడంతో సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. నీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**కాళేశ్వరంపై కాంగ్రెస్ నేతల విమర్శలు...**

ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి, కమీషన్ల ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతుల సాగునీటి అవసరాలకు ఎల్లంపల్లి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నీటిని వినియోగిస్తున్నామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్ డి ఎస్ ఏ) నివేదికలో వెల్లడైన అంశాలను ఈ సందర్భంగా వారు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో రామడుగు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తాజా మాజీ ఎంపీపీ జవ్వాజి హరీశ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోల రమేష్, ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌గౌడ్, సర్పంచులు దావా అనంతరెడ్డి, వీర్ల నర్సింగరావు, నరేందర్‌రెడ్డి, మొయిజ్, తహసీల్దార్ రాజమల్లయ్య, ఎంపీడీవో రాజేశ్వరి, నాయకులు కత్తి మధు, మనీష్, పరశురామ్, జవ్వాజి అజయ్, రామ్‌రెడ్డి, స్వామి, ఈశ్వర్, వెంకటేష్, పోచయ్య, లక్ష్మణ్, వేణుతో పాటు 23 గ్రామాల శాఖ అధ్యక్షులు, రైతులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి పంప్‌హౌస్ పంపులు ఆన్

- కాళేశ్వరం నీటితో రైతులకు ఊరట
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**రామడుగు, జూలై 29 (ప్రజాతీర్పు ప్రతినిధి)**



బీఆర్ఎస్ పార్టీ, రైతులు చేసిన పోరాటం ఫలించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి గాయత్రి పంప్‌హౌస్ ద్వారా సాగునీటిని విడుదల చేసిందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. రామడుగు మండలం లక్ష్మీపూర్ పరిధిలోని గాయత్రి పంప్‌హౌస్‌ను బీఆర్ఎస్ నాయకులతో కలిసి బుధవారం సందర్శించిన ఆయన, పంపులను ఆన్ చేసిన అనంతరం నీటికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు నీటితోనే రైతులకు ఊరట లభిస్తోందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని, నీళ్లు రావని గతంలో ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులకు ఇప్పుడు అదే కాళేశ్వరం నీళ్లు సమాధానం చెబుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులు వరి సాగు చేయవద్దని, నీటి పరిస్థితులు అనుకూలంగా లేవని చెబుతుండగా, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎన్‌డీఎస్‌ఏ నివేదిక వచ్చిన తర్వాతే నీటి విడుదలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పడం ప్రభుత్వంలోని అయోమయానికి నిదర్శనమని అన్నారు. ముఖ్యమంత్రి ఒక మాట, మంత్రులు మరో మాట మాట్లాడుతుంటే రైతులు ఎవరిని నమ్మాలని ప్రశ్నించారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో బ్యారేజీల భద్రతకు సంబంధించిన అంశాలే తమ పరిధిలో ఉంటాయని, నీటి నిర్వహణ, సాగునీటి పంపిణీ రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నివేదిక పేరుతో రైతులను అయోమయానికి గురిచేస్తోందని ఆరోపించారు. కన్నెపల్లి పంపులను ముందుగానే ప్రారంభించి ఉంటే గాయత్రి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసి మిడ్‌మానేరు, రంగనాయకసాగర్, అన్నపూర్ణ, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ వరకు నీటిని తరలించి రిజర్వాయర్లు, చెరువులను నింపే అవకాశం ఉండేదని తెలిపారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతుల నారుమడులు ఎండిపోయాయని, జూలై చివరి దశకు చేరుకున్నప్పటికీ నాట్లు వేసే పరిస్థితి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గాయత్రి పంప్‌హౌస్ ద్వారా నీటి విడుదలను పూర్తి స్థాయిలో కొనసాగించి ప్రతి చెరువు, ప్రతి రిజర్వాయర్‌ను నింపాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు.

### కేసీఆర్ దూరదృష్టి వల్లే నీళ్లు

ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సుంకె రవిశంకర్ ప్రశంసించారు. గోదావరి జలాలను తెలంగాణ రైతాంగానికి అందించాలనే లక్ష్యంతో కాళేశ్వరం వంటి భారీ ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్ దూరదృష్టి వల్లే నేడు రైతులకు సాగునీరు అందుతోందని అన్నారు. కేసీఆర్‌పై గతంలో చేసిన విమర్శలు ఇప్పుడు అసత్యమని తేలిపోయాయని పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగం తరపున మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు సుంకె రవిశంకర్ తెలిపారు.



## యుగంధర్ మృతికి ఎమ్మెల్యే కూనంనేని నివాళి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలై 29 (ప్రజా తీర్పు)**

సుజాతనగర్ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చింతలపూడి రాజశేఖర్ సోదరుడు, వెంకన్న (మాజీ పెట్ సార్) సోదరుడు చింతలపూడి యుగంధర్ గుండెపోటుతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న కొత్తగూడెం ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వారి నివాసానికి చేరుకుని యుగంధర్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యుగంధర్‌తో తనకున్న అనుబంధాన్ని ఎమ్మెల్యే గుర్తు చేసుకుని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా, కొత్తగూడెం--పాల్వంచ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భూక్య దస్రు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు జక్కుల రాములు, సుజాతనగర్ మండల కార్యదర్శి కుమారి వీర హనుమంతరావు, సిపిఐ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, స్థానిక ప్రజలు, గ్రామ పెద్దలు పాల్గొని యుగంధర్ పార్థివ దేహానికి నివాళులర్పించారు.



## ఉపసర్పంచ్‌ల సమస్యలు పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్‌కు తెలంగాణ ఉపసర్పంచ్ ఫోరం వినతి
- గౌరవ వేతనం, అధికారాలు కల్పించాలని డిమాండ్

**(దుర్గం నగేష్ ,ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 29:**

పెద్దపల్లి జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉపసర్పంచ్ ఫోరం నాయకులు జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తీక్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు జంగ్ అనిల్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో ఈ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫోరం నాయకులు మాట్లాడుతూ, జిల్లాలోని 262 గ్రామ పంచాయతీల్లో ఇటీవల ఎన్నికైన ఉపసర్పంచ్‌లు గ్రామాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నప్పటికీ వారికి తగిన గుర్తింపు, అధికారాలు, గౌరవ వేతనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్‌లకు నెలకు రూ.5,000, వార్డు సభ్యులకు రూ.3,000 గౌరవ వేతనం మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలపై ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యుల పేర్లను తప్పనిసరిగా నమోదు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా పంచాయతీ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు, తీర్మానాలు, చెక్కులపై ఉపసర్పంచ్‌లకు కూడా సంతకం చేసే అధికారం కల్పించాలని కోరారు. మండల స్థాయిలో నిర్వహించే గ్రామాభివృద్ధి సమీక్ష సమావేశాలకు ఉపసర్పంచ్‌లను ఆహ్వానించి, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేరుగు జంపన్న (జానీ), నాయకులు బోనగిరి అజయ్ కుమార్, ఎలిగేటి మల్లేశం, తీగుల్ల సతీష్ రెడ్డి, బరత స్వామి, సామల నాగభూషణం, అరిగె రవికుమార్, తమ్మనవేణి రాజయ్య, కత్తెర్ల లచ్చయ్య, తడ్వాయి ప్రమోద్ రెడ్డి, కోల తిరుపతి, బెజ్జంకి యమున రాజేందర్, అయిలవేని తిరుపతి, దయ్యాల రజిత, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## నవదుర్గ ఆలయంలో వైభవంగా "మనసార మన సారె" మహోత్సవం



**కోరుట్ల జూలై 29 (ప్రజాతీర్పు)**

కోరుట్ల పట్టణంలోని శ్రీ శివమారాండేయ కోటి నవదుర్గ దేవాలయంలో ఆషాఢ మాసోత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు నిర్వహించిన "మనసార మన సారె" మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా ముగిసింది. వందలాది మంది మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో శోభాయాత్రగా ఆలయానికి చేరుకుని అమ్మవారికి 108 రకాల మంగళ ద్రవ్యాలను సారెగా సమర్పించారు. బ్రహ్మశ్రీ దేగామ ప్రదీప్ శర్మ, బ్రహ్మశ్రీ శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వందలాది మంది మహిళలతో సామూహిక శ్రీ లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, నామసంకీర్తన అనంతరం వర్షం కురవడంతో భక్తులు అమ్మవారి అనుగ్రహంగా భావించి హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం భక్తి, ఐకమత్యం, సాంప్రదాయ విలువలను పెంపొందించిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షులు గుంటుక ప్రసాద్, ఆలయ కమిటీ చైర్మన్ జిల్లా ధనంజయ్, యువత అధ్యక్షులు జక్కుల ప్రవీణ్ కుమార్, లలిత పారాయణ బృందం సభ్యులు, కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



## అప్పల్ రావు పేటలో ఘనంగా మొక్కల పంపిణీ

**నర్సంపేట రూరల్, నెక్కొండ,జూలై 29, ప్రజా తీర్పు ప్రతినిధి:**

అప్పల్ రావు పేట గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఈరోజు (బుధవారం) మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణ మరియు గ్రామాన్ని పచ్చదనంతో నింపే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించింది. ఈకార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఉడుగుల అశోక్ మరియు గ్రామ పంచాయితీ సెక్రెటరీ కలిసి సంయుక్తంగాప్రారంభించారుఈ సందర్భంగా వారు గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేసి, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు.?సర్పంచ్ ఉడుగుల అశోక్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడానికి మొక్కల పెంపకం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు.?గ్రామ పంచాయితీ సెక్రెటరీ మాట్లాడుతూ, ఈ పంపిణీ కార్యక్రమం గ్రామాన్ని పచ్చదనంతో నింపడానికి దోహదపడుతుందని, గ్రామస్తులందరూ భాగస్వాములు కావాలని కోరారు.?ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో గ్రామస్తులు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



## రేషన్ డీలర్ల సభ్యత్వ నమోదు కార్యక్రమం ఘన ప్రారంభం...

**(భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ప్రజాతీర్పు భూక్య సందీప్) జూలై 29,**

తెలంగాణ రాష్ట్ర ఆథరైజ్డ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రమేష్ బాబు, రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు ఊకె శేఖర్ బుధవారం భద్రాచలం మండలంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. రేషన్ డీలర్ల సంక్షేమం, సంఘం బలోపేతమే లక్ష్యంగా ప్రతి రేషన్ డీలర్ సభ్యత్వం పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా, డివిజన్, మండలాల ఆథరైజ్డ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు, రేషన్ డీలర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం డివిజన్ అధ్యక్షుడు భూక్యా సందీప్‌తో పాటు భూక్యా లక్ష్మణ్, జీ. రమేష్, ఎస్. రాంబాబు, వి. వీరయ్య, భూక్యా సాయి కౌశిక్, కె. రమాదేవి, పి. సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ బోల్తా పడి రైతు మృతి

**జమ్మికుంట , (జులై 29) ప్రజాతీర్పు**



వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్న తరుణంలో ఓ రైతు ట్రాక్టర్ బోల్తాపడడంతో దాని కింద పడి మృతి చెందిన సంఘటన కరీంనగర్ జిల్లాలో చోటుచేసుకుంది. జమ్మికుంట పట్టణంలోని దుర్గా కాలనీలో నివాసం ఉంటున్న అరకాల కుమారస్వామి(50) అనే రైతు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడటంతో మృతి చెందాడు. కమలాపూర్ మండలంలోని బీం పల్లి గ్రామానికి చెందిన అరకాల వీర కుమారస్వామి గత కొద్ది సంవత్సరాలుగా జమ్మికుంట పట్టణంలోని దుర్గా కాలనీలో సొంత నివాసం కట్టుకొని జీవిస్తున్నాడు. బుధవారం భీంపల్లి లో తన పొలం పనులు చూసుకొని ఇంటికి తిరిగి వస్తుండగా అంకుసాపూర్ కన్నూర్ రోడ్డు మధ్య ఉన్న కెనాల్ వద్ద ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు భార్య ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.



## షాపూర్ నగర్‌లో చిన్న వ్యాపారస్తుల దుకాణాల కూల్చివేత దురదృష్టకరం

### బాధితులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ డిమాండ్

**షాపూర్, జులై 29(ప్రజా తీర్పు )**

ఎన్నో ఏళ్లుగా వీధి వ్యాపారంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న షాపూర్ నగర్ రాజీవ్ పార్క్ పక్కన, రెండు వైపులా పూర్తిగా మూసి ఉన్న రోడ్డులో చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న నిరుపేద వ్యాపారస్తులపై జవీజ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులు జారీ చేయకుండా ఉద్దేశపూర్వకంగా చర్యలు చేపట్టి, సుమారు 12 దుకాణాలను పూర్తిగా ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమైన విషయం. ఈ సంఘటనను బీఆర్ఎస్ నాయకులు అన్వర్ వెంటనే డివిజన్ అధ్యక్షులు లిలిపుప్పాల భాస్కర్ దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే సంఘటన స్థలానికి చేరుకొని బాధిత వీధి వ్యాపారస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఈ విషయాన్ని ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి తీసుకువెళ్లగా, ఎమ్మెల్యే వెంటనే స్పందించి మున్సిపల్ అధికారులతో మాట్లాడి బాధిత వీధి వ్యాపారస్తులకు తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ, ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నిరుపేదల జీవనాధారమైన దుకాణాలను కూల్చివేయడం మానవత్వానికి విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. వీధి వ్యాపారుల హక్కులను పరిరక్షిస్తూ వారికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.




## మద్ది వంచలో... సీజనల్ వ్యాధులపై అవగాహన

### డాక్టర్ హనుమంతరావు

**(పగడాల రామారావు ప్రజాతీర్పు గార్ల మండల ప్రతినిధి )జూలై 29**

గార్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సిహెచ్సి ఆసుపత్రి ప్రభుత్వ వైద్యులు డాక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. మండల పరిధి మద్దిమంచలో బుధవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముల్కనూరు ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. అనారోగ్య బాధితులు 42 మంది శిబిరంలో పాల్గొని వైద్యుల చేత పరిశీలింప చేసుకున్నారు. తదుపరి మందులను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని అవగాహన సదస్సులో ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అనారోగ్య బాధితులు మండల వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## వరాహస్వామి ఆలయ వెబ్‌సైట్ ప్రారంభించిన మేయర్ కొలగాని

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) జులై 29**



కరీంనగర్ లోని ప్రసిద్ధ యజ్ఞ వరాహస్వామి దేవాలయంలో ఆలయ వెబ్‌సైట్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలందించడంలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగం ఎంతో ఉపయోగమని శ్రీనివాస్ పేర్కొన్నారు. దేవాలయ వెబ్‌సైట్ ద్వారా భక్తులు ఆలయ కార్యక్రమాలు, పూజా వివరాలు, సేవలు ఇతర సమాచారాన్ని సులభంగా తెలుసుకునే అవకాశం కలుగుతుందని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేష్, కార్పొరేటర్ తోట అనిల్ దేవాలయ కమిటీ సభ్యులు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు

- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, కల్వర్టులు

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) జులై 29:**



మంగళవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల మూలంగా జగిత్యాల జిల్లా ఎండపల్లి,వెల్గటూర్ మండలాల్లో వాగులు, వంకలు, కాలువలు, కల్వర్టులు పొంగి పొర్లుతున్నాయి. గ్రామాల్లోని చెరువులన్నీ జలకలను సంతరించుకున్నాయి. ఎండపల్లి మండల కేంద్రం నుండి కొండాపూర్ వెళ్లే రోడ్డు పై గల వాగు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే వెల్గటూర్ మండల కేంద్రం నుండి జగదేవ్ పేట వెళ్లే రోడ్డు పై గల కల్వర్టు పై నుండి వరద నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రాంనూర్ గ్రామంలో వరద నీరు ఇళ్లలోకి చేరడంతో నివాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కొత్తపేట పడకల్ గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని, చేపల వేటకు వెళ్లకూడదని, పశువుల కాపర్లు అతి జాగ్రత్తగా ఉండాలని అధికారులు, ప్రజా ప్రతినిధులు సూచించారు.



## నేడు(గురువారం) రోజున జిల్లాలో మంత్రుల పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు: జిల్లా ఎస్పీ

**(నారు కట్ల మధు ప్రజా తీర్పు రాజన్న సిరిసిల్ల జిల్లా) జూలై 29**

గురువారం రోజున వేములవాడ, సిరిసిల్ల లో మంత్రుల బృందం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈసందర్భంగా బుధవారం రోజున సాయంత్రం సిరిసిల్ల లోని రగుడు బై పాస్ జంక్షన్,బస్ షెల్టర్ ప్రాంతాలను, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో ట్యాంక్ బండ్ పార్క్ ప్రాంతాలను ఎస్పీ గారు స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎస్పీ గారి వెంట డిఎస్పీ లు నాగేంద్రచారి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు, సి.ఐ లు శ్రీనివాస్, వీరప్రసాద్, ఎస్.ఐ లు సిబ్బంది ఉన్నారు. గురువారం రోజున వేములవాడ, సిరిసిల్ల లో మంత్రుల బృందం పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. ఈసందర్భంగా బుధవారం రోజున సాయంత్రం సిరిసిల్ల లోని రగుడు బై పాస్ జంక్షన్,బస్ షెల్టర్ ప్రాంతాలను, వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో ట్యాంక్ బండ్ పార్క్ ప్రాంతాలను ఎస్పీ గారు స్వయంగా అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశించారు. ఎస్పీ గారి వెంట డిఎస్పీ లు నాగేంద్రచారి, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ వెంకటేశ్వర్లు, సి.ఐ లు శ్రీనివాస్, వీరప్రసాద్, ఎస్.ఐ లు సిబ్బంది ఉన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్‌ను కోరిన ఎంపీ ధర్మపురి అర్వింద్

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) జూలై 29**



జగిత్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌ను పలు కీలక అంశాలపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్ సమావేశంలో పాల్గొంటున్న ఆయన, భారీ వర్షాల నేపథ్యంలో ఈరోజు చరవాణి ద్వారా కలెక్టర్ తో మాట్లాడారు. మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖ, వాటర్ సప్లై, విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బీ (=ఉదీ), జాతీయ రహదారుల సంస్థ (చీనాూ×)తో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. అలాగే జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల బలహీనంగా ఉన్న కట్టలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. వాతావరణ శాఖ రానున్న రెండు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలకు నిత్యావసర వస్తువులు, స్వచ్ఛమైన తాగునీరు, వైద్య సేవలు తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ,అవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వరద నీరు ప్రవహిస్తున్న ప్రాంతాలు, వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దని, జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## కారు ఢీకొని మహిళ దుర్మరణం

**హుస్నాబాద్ జులై 29 రవీందర్ ప్రజా తీర్పు**



వేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో మహిళ దుర్మరణం అయ్యింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సాదుల యాదలక్ష్మి (59) భీమదేవరపల్లి మండలం మల్లారం కు వెళ్లి రాత్రి గం. 7 ప్రాంతంలో హనుమకొండ రోడ్డులో గల పెట్రోలు బంకు వద్ద బస్సు దిగింది. ఈ క్రమంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఆమెను ఢీకొట్టింది. దీంతో ఎగిరి కింద పడిన ఆమెకు తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలోనే ఆమె మృతి చెందిందని తెలిపారు. కాగా మృతురాలికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతి నీటి చుక్కను ఒడిసి పట్టాలి

- గ్రామస్థాయిలో తెలంగాణ జలసిరి అమలుకు చర్యలు
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు సెప్టెంబర్ 15లోపు పూర్తి చేయాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 29 :**



భూగర్భ జలాల పెంపుదలతో పాటు ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ జలసిరి, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామీణాభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఇంటికో ఇంకుడు గుంత.. బోర్‌కు రీచార్జ్ పిట్ ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూగర్భ జలాల సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వీబీ జీ రామ్ జీ (ఎదీ+=ూవీ+) పథకాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ గ్రామాల్లో జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి బోర్‌వెల్ వద్ద రీచార్జ్ పిట్ ఏర్పాటు చేసి భూగర్భ జలాల పునరుద్ధరణకు కృషి చేయాలని సూచించారు. రైతులకు ఫార్మ్‌పాండ్లపై అవగాహన రైతులకు పంటకుంటలు (ఫార్మ్‌పాండ్లు) ఏర్పాటుపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రైతుల అంగీకారంతో ఫార్మ్‌పాండ్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. ముఖ్యంగా ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మ్‌పాండ్ ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.

### ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను సెప్టెంబర్ 15లోపు పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. రెండో విడతలో అర్హుల ఎంపిక ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని సూచించారు. మొదటి విడతలో మంజూరు కాకుండా పెండింగ్‌లో ఉన్న ఇళ్లు, గుడిసెల్లో నివసిస్తున్న అర్హుల వివరాలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు. నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇంటి స్థల స్లాబ్ విస్తీర్ణం 750 చదరపు గజాలకు మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఇందిరమ్మ ఇంటికి 90 రోజుల ఉపాధి హామీ పనిదినాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, వ్యక్తిగత మరుగుదొడ్ల (ఐహెచ్‌ఎల్) నిర్మాణాలకు సంబంధించిన చెల్లింపులు సకాలంలో జరిగేలా పంచాయతీ కార్యదర్శులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్, డీఆర్‌డీవో కాళిందిని, పీడీ హౌసింగ్ రాజేశ్వర్, ఎంపీడీవోలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# గోదావరిఖనిలో ఆహార తనిఖీలు.. కల్తీపై కొరడా

- నిషేధిత రంగులు, పునర్వినియోగ వంటనూనె గుర్తింపు
- పలు రెస్టారెంట్లలో ఆహార పదార్థాలు స్వాధీనం.. ధ్వంసం చేసిన అధికారులు

**(దుర్గం నగేష్ ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్, జూలై 29:**

ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఆహార భద్రత అధికారులు గోదావరిఖని పట్టణంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ సహకారంతో బుధవారం పట్టణంలోని పలు ఆహార వ్యాపార సంస్థలను తనిఖీ చేశారు. గోదావరిఖని బస్‌స్టాండ్ పరిసర ప్రాంతాలతో పాటు మార్కండేయ కాలనీలోని రెస్టారెంట్లు, ఆహార విక్రయ కేంద్రాల్లో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఆహార భద్రత నిబంధనల ఉల్లంఘనలు గుర్తించారు. నిషేధిత ఫుడ్ కలర్స్ వినియోగం నాని మండి ఫ్యామిలీ రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల తయారీలో నిషేధిత ఫుడ్ కలర్స్ ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. రంగులు కలిపి తయారు చేసిన సుమారు 5 కిలోల చికెన్‌ను స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అలాగే టోటల్ పోలార్ కాంపౌండ్స్ (ూజ) మీటర్ ద్వారా వంటనూనెను పరిశీలించగా పునర్వినియోగం చేస్తున్నట్లు నిర్ధారణ కావడంతో సుమారు 3 లీటర్ల నూనెను కూడా ధ్వంసం చేశారు. మిఠాయిల్లో మృత ఈగలు కాశ్మీర్ స్వీట్స్ అండ్ స్నాక్స్ దుకాణంలో పరిశుభ్రత లోపాలను అధికారులు గుర్తించారు. జిలేబీ, జాంగ్రీ వంటి మిఠాయిల్లో మృత ఈగలు కనిపించడంతో పాటు బంగాళాదుంప చిప్స్ పాతబడిన స్థితిలో ఉన్నట్లు గుర్తించారు. దీంతో సుమారు 7 కిలోల మిఠాయిలు, ఒక కిలో బంగాళాదుంప చిప్స్‌ను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు.

### మండి రైస్‌లో రంగులు.. మయోనైస్ నిల్వ

జైకా మండి రెస్టారెంట్‌లో మండి రైస్ తయారీలో ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అదేవిధంగా పచ్చి గుడ్లతో తయారు చేసిన మయోనైస్‌ను నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఈ మేరకు సుమారు 8 కిలోల మండి రైస్, 2 కిలోల మయోనైస్‌ను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. నోటీసులు జారీ నిబంధనలు ఉల్లంఘించిన ఆహార వ్యాపార సంస్థలకు సంబంధిత చట్టాల ప్రకారం నోటీసులు జారీ చేసినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు. ఫుడ్ కలర్స్ వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, వంటనూనెను సురక్షితంగా వినియోగించే విధానం, మయోనైస్ తయారీలో పాటించాల్సిన పరిశుభ్రత ప్రమాణాలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. తనిఖీలు కొనసాగుతాయి ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఆహార భద్రత తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఫుడ్ సేఫ్టీ అధికారి వి. అంకిత్ రెడ్డి తెలిపారు. ఆహార భద్రతా నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.




# ఓటరు వివరాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలి

- బీఎల్‌వోలు నమోదు చేసిన వివరాలను ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు పరిశీలించాలి: సీఈవో సుదర్శన్‌రెడ్డి

**(దుర్గం నగేష్, ప్రజా తీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫ్ రిపోర్టర్), జూలై 29:**

ఎస్‌ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో ఎస్‌ఐఆర్ పురోగతి, ఓటర్ల వివరాల నమోదు, డిజిటలైజేషన్, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ శ్రీరాములు పాల్గొన్నారు. తప్పుల సవరణకు రెండు రోజుల గడువు ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ ఎస్‌ఐఆర్ ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణకు కొద్ది రోజులే మిగిలి ఉన్నందున ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బీఎల్‌వోలు వెబ్‌సైట్‌లో ఓటర్ల వివరాలు నమోదు చేసే సమయంలో కొన్ని పొరపాట్లు జరిగినట్లు గుర్తించామని తెలిపారు. దీని వల్ల అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో లేకుండా పోతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. బీఎల్‌వోలు నమోదు చేసిన ప్రతి వివరాన్ని ఈఆర్‌వోలు, సూపర్‌వైజర్లు తప్పనిసరిగా క్రాస్ వెరిఫై చేయాలని ఆదేశించారు. యాదృచ్ఛికంగా ఓటర్ల వివరాలను పరిశీలించి, ఉన్న లోపాలను మరో రెండు రోజుల్లోగా సరిదిద్దాలని సూచించారు. ఆ తర్వాత తప్పులు బయటపడితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పట్టణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

పట్టణ ప్రాంతాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉందని, సూపర్‌వైజర్లు బీఎల్‌వోలతో సమన్వయం చేసుకుని పనులను వేగవంతం చేయాలని సీఈవో సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తయిందని, 80 నియోజకవర్గాల్లో 90 శాతానికి పైగా ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా పూర్తి చేయాలని ఆదేశించారు.

### సంక్షేమ పథకాలతో సంబంధం లేదు

ఎస్‌ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో జరుగుతున్న అపోహలను తొలగించాలని సీఈవో సూచించారు. ఓటరు జాబితాకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా వివరించాలని అధికారులను ఆదేశించారు. తప్పుడు ప్రచారాలను వెంటనే ఖండించాలని, బీఎల్‌వోలతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ ఎస్‌ఐఆర్ పురోగతిని సమీక్షించాలని సూచించారు. రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి ప్రక్రియ వివరాలను తెలియజేయాలని తెలిపారు.

### బీఎల్‌ఏలకు జాబితాల అందజేత

పోలింగ్ స్టేషన్‌ల వారీగా ముసాయిదా ఓటరు జాబితాను బూత్ లెవల్ ఏజెంట్లకు (బీఎల్‌ఏ) అందజేసి వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని సీఈవో ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్, ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సౌకర్యార్థం అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలి

- గ్రామాల అభివృద్ధిలో అధికారులు బాధ్యతతో పనిచేయాలి
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి) జులై 29 :**



గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అధికారులు ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించే దిశగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ లు, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన అభివృద్ధి సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీలు, గ్రామ పంచాయతీల అవసరాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేస్తుందని మంత్రి తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియను వంద శాతం పూర్తి చేసిన బీఎల్ఓలను మంత్రి సన్మానించి అభినందించారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, గ్రామ సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సర్పంచుల స్థానంలో భర్తలు, కొడుకులు ప్రత్యక్షం!

- బీర్ పూర్ ఎంపీడీవో కార్యాలయ సమావేశంలో 'సర్పంచ్ పతి' వ్యవస్థపై విమర్శలు..
- అధికారుల గైర్హాజరుపై ప్రజాగ్రహం



**బీర్పూర్ జులై 29( ప్రజా తీర్పు )**

ప్రజలు ఓట్లేసి గెలిపించింది మహిళా ప్రతినిధులను.. కానీ ప్రభుత్వ అధికారిక సమీక్షల్లో పెత్తనం చలాయిస్తున్నది మాత్రం వారి భర్తలు, కొడుకులు. మహిళా సాధికారతకు గొడ్డలిపెట్టుగా మారిన ఈ 'సర్పంచ్ పతి' సంస్కృతి జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండల కేంద్రంలో మరోసారి బహిర్గతమై తీవ్ర చర్చకు దారితీసింది.

### జీపీ అభివృద్ధి సమావేశానికి సర్పంచుల గైర్హాజరు

బీర్ పూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనకు సంబంధించిన ఒక కీలక సమావేశాన్ని అధికారులు నిర్వహించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి, మౌలిక వసతులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, సిసి రహదారుల నిర్మాణం మరియు భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే, ఈ ప్రాధాన్యత కలిగిన సమావేశానికి పలువురు మహిళా సర్పంచులు గైర్హాజరయ్యారు.

### కుర్చీల్లో కూర్చొని హల్‌చల్ చేసిన 'ప్రతినిధులు'

మహిళా సర్పంచులు రాకపోయినా, వారి స్థానాలను భర్తలు, కొడుకులు ఆక్రమించారు. సమావేశ మందిరంలో అధికారుల ముందే కుర్చీల్లో కూర్చొని చర్చలు వినడం, నిర్ణయాల్లో భాగస్వామ్యం కావడం వంటి దృశ్యాలు అక్కడ రికార్డైన వీడియోల్లో, ఫోటోలో స్పష్టంగా కనిపించాయి. ప్రజలు ఎన్నుకున్న మహిళా సర్పంచులు ఇండ్లకే పరిమితం కాగా, వారి తరఫున పురుషులు అధికారిక సమీక్షల్లో పాల్గొనడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### 'సర్పంచ్ పతి' పెత్తనం వెనుక కారణాలేంటి?

మహిళా రిజర్వేషన్ ద్వారా స్థానిక సంస్థల్లో మహిళలకు నాయకత్వ అవకాశాలు కల్పించిన నేపథ్యంలో, ఎన్నికైన ప్రజాప్రతినిధులు స్వయంగా బాధ్యతలు నిర్వర్తించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. అలాంటప్పుడు సమావేశాల్లో వారి స్థానంలో కుటుంబ సభ్యులు పాల్గొనడం వెనుక కారణాలేమిటన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక, కుటుంబ ఒత్తిళ్లు, పరిపాలనా వ్యవహారాలపై మహిళలకు సరైన అవగాహన కల్పించకపోవడం మరియు అధికారుల ఉదాసీనత వల్లే ఈ వ్యవస్థ కొనసాగుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### అధికారుల, సర్పంచుల సమిష్టి నిర్లక్ష్యం

గ్రామాల భవిష్యత్తును నిర్ణయించే ఈ అత్యంత కీలకమైన సమావేశానికి కొందరు సర్పంచులు మాత్రమే కాదు, కొందరు మండల అధికారులు కూడా గైర్హాజరైనట్లు విశ్వసనీయ సమాచారం. ప్రజారోగ్యం, అభివృద్ధికి సంబంధించిన సమావేశాల పట్ల అధికారులే ఇలాంటి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "ప్రభుత్వాలు మారినా, నిధులు వచ్చినా.. ఇలాంటి బాధ్యతారాహిత్యం వల్లనే గ్రామాలు ఇంకా వెనుకబడే ఉంటున్నాయి" అని మండల ప్రజలు మండి పడుతున్నారు.

### లక్ష్యం దెబ్బతింటోంది.. ఉన్నతాధికారులు స్పందించేనా?

ప్రజలు ఎన్నుకున్నది మహిళా సర్పంచులను... కానీ సమావేశాల్లో పాల్గొంటోంది మాత్రం వారి భర్తలు. గ్రామస్థాయిలో మహిళల నాయకత్వాన్ని బలోపేతం చేయాలనే ప్రభుత్వ ఆశయానికి ఇలాంటి ఘటనలు ఎంతవరకు దోహదపడతాయి..? చట్టసభల్లో మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నా, క్షేత్రస్థాయిలో వారు కేవలం 'రబ్బర్ స్టాంపుల'లా మారిపోతున్నారనే ఆరోపణలకు ఈ ఘటనే నిదర్శనం. బీర్ పూర్ ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ నిబంధనల ఉల్లంఘనపై జిల్లా కలెక్టర్, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా వ్యవహరించిన సర్పంచులపై, విధులకు హాజరుకాని అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## భారీ వర్షానికి ఇల్లు కూలిపోవడంతో వెంటనే స్పందించిన రెవెన్యూ అధికారులు

**మంథని, జూలై-29 (ప్రజాతీర్పు)**

మంథనిలో బుధవారం కురిసిన భారీ వర్షాలకు బోయిన్‌పేట్ 6వ వార్డులోని ఓ ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఘటన విషయం తెలియగానే మంథని తహసీల్దార్ తో పాటు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి. సదయ్య వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబానికి అవసరమైన తక్షణ సహాయం అందించేలా చర్యలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బోయిన్‌పేట్ 6వ వార్డు ఇండిపెండెంట్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలత క్రాంతి కుమార్ మాట్లాడుతూ, భారీ వర్షాల సమయంలో వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచిన తహసీల్దార్ కు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వేగంగా స్పందించడం అభినందనీయమని పేర్కొన్నారు.

## భారీ వర్షాలవల్ల పెగడపల్లి మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### పెగడపల్లి ఎస్సై కిరణ్ కుమార్

**( కుమారస్వామి ప్రజా తీర్పు జగిత్యాల రూరల్) జూలై 29**



జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెగడపల్లి ఎస్సై.కిరణ్ కుమార్ ప్రజలకు సూచించారు. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, కల్వర్టులను దాటవద్దని, అత్యవసరమైతే తప్ప ఇంటిలో నుండి బయటకు రావద్దని కోరారు. నీటి ఉద్ధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, విద్యుత్ స్తంభాలు, తెగిపడిన వైర్లు, పాత ఇండ్లు.పాత గోడలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎక్కడైనా, ఎప్పుడైనా సహాయం అవసరం అనుకుంటే తక్షణమే 100 కు కాల్ చేయాలని ఎస్సై ప్రజలను కోరారు. ప్రజల కోసం ఎప్పుడూ అందుబాటులో ఉంటామని ,ఏ సమయంలోనైనా అందుబాటులో ఉంటామని అన్నారు అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే.పోలీసులను ఆశ్రయించాలని తెలిపారు.



## భూభారతి-భూసర్వే రీ సర్వే లో మొదటి గ్రామంగా సిరికొండ గ్రామం

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట )జూలై 29**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి భూసర్వే లో భాగంగా ప్రభుత్వం మొత్తం భూముల విషయములో రీ సర్వే చేయుటకు ఆదేశములు వచ్చినందున, అందులో భాగముగా ఇల్లంతకుంట మండలం లోని సిరికొండ గ్రామము మొదటగా ఎంపిక కాబడినది, ఈరోజు సిరికొండ గ్రామము లో రీసర్వే చేయుట విషయములో గ్రామస్తులతో గ్రామ సభ నిర్వహించగా ఇట్టి సర్వే రేపటి నుండి గ్రామము యందు మొదలు అవుతుందని తహసీల్దార్ రాచకట్ల సురేష్ తెలియజేసారు ఇట్టి గ్రామ సభకు గ్రామ సర్పంచ్ రాజన్న సిరిసిల్ల ఏడి సర్వేయర్, ఆర్ఐ, కార్యదర్శి,లైసెన్స్ సర్వేయర్స్ వార్డ్ మెంబర్స్ మరియు గ్రామస్తులు తదితరులు పాలుగోన్నారు



## నీట్ పేపర్ లీకులతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అయోమయం

### సీపీఐ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి

**హుస్నాబాద్ జులై 29 రవీందర్ ప్రజా తీర్పు**

నీట్ పేపర్ లీక్ తో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అయోమయంగా మారిందని, విద్యార్థుల చావులకు కారణమైన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను వెంటనే బర్తరఫ్ చేయాలని,ప్రధాన నరేంద్ర మోడీ తక్షణమే రాజీనామా చేయాలని సీపీఐ సీనియర్ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం హుస్నాబాద్ నియోజకవర్గ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం నియోజకవర్గ నాయకులు నాగేల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చాడ వెంకటరెడ్డి విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. నీట్ పేపర్ లీక్ లతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును బలి చేసారని నీట్ పరీక్షల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించాలనీ అభిప్రాయపడ్డారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనలో విద్యార్థులపై లాఠీ ఛార్జ్ అమానుష్యమైన ఘటనపై సుప్రీం కోర్టు న్యాయమూర్తులు సరైన సమయంలో స్పందించకపోవడం సరి కాదని చట్టాలు పాలకులకు చుట్టలైనయాని అభిప్రాయం వ్యక్తం చేశారు. దేశంలో మార్పు కావాలి బీజేపీ గద్దే దిగి పోవాలనే నినాదంతో ఆగస్టు 6 నుండి 15 వరకు పల్లె పల్లెకు సీపీఐ పాదయాత్రలు జయప్రదం చేయుట కొసం ప్రజలు సహకరించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు నాయకులకు ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ హన్మకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్య నారాయణ, సిద్దిపేట జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అదరి శ్రీనివాస్, కనుకుట్లశంకర్, నియోజకవర్గ సీపీఐ నాయకులు బొయిని అశోక్, గూడెం లక్ష్మి, ఉట్కూరి రాములు, బత్తుల బాబు, బాషబొయిన సంతోష్, తెరాల సత్య నారాయణ, జనగాం రాజ్ కుమార్, గాంభీరపు మధు,తోట బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణ సమతుల్యతలో చెట్లు ప్రధాన పాత్ర పోషిస్తాయి

### ఎక్సైజ్ ఎస్సై భారతి


**హుస్నాబాద్ జులై 29 రవీందర్ ప్రజా తీర్పు**

పర్యావరణ సమతుల్యతలో చెట్లు ప్రధాన పాత్ర పోషిస్తాయని తిమ్మాపూర్ ఎక్సైజ్ ఎస్సై భారతి అన్నారు. చిగురుమామిడి మండలం గాగిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ సన్నిల్ల కవిత ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చెరువు కట్ట కు ఇరువైపులా ఖర్జూర, ఈత మొక్కలు సర్పంచ్ సన్నిళ్ళ కవిత తో కలిసి నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ... వన మహోత్సవం అనేది భారతదేశంలో ప్రతి సంవత్సరం జూలై మొదటి వారంలో జూలై 1 నుండి 7 వరకు నిర్వహించే ఒక వారం రోజుల చెట్ల పెంపక పండుగ అని తెలిపారు. దీని యొక్క ప్రధాన ఉద్దేశం భారీ ఎత్తున మొక్కలు నాటడం, పర్యావరణాన్ని రక్షించడం మరియు అటవీ సంపద ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం. ఈ కార్యక్రమాన్ని 1950 లో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ కె.ఎం. మున్షి ప్రారంభించారు. దేశంలో వర్షాకాలం నైరుతి రుతుపవనాలు ప్రారంభమయ్యే సమయం కావడంతో, మొక్కలు త్వరగా పెరగడానికి జూలై మొదటి వారాన్ని ఎంపిక చేసి జరుపుకోవడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం భూమిపై పచ్చదనాన్ని పెంచడం.కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణ సమతుల్యతను కాపాడడం.నేల కోతను నివారించడం మరియు భూగర్భ జలాలను పెంపొందించడం.పండ్ల మొక్కలు, కలప మరియు పశువులకు కావలసిన మేతను అందించే చెట్లను కూడా ప్రోత్సహించడం కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటేశం గౌడ్, మంద శ్రీనివాస్, అన్నవేణి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి సంపత్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్, మహిళా సమైక్య సీ ఏ లు లత, రమ, గౌడ సంఘం సభ్యులు మధు గౌడ్, వెంకటేశం గౌడ్, శేఖర్ గౌడ్,బిక్షపతి గౌడ్, రాజేశం, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి తలెత్తితే ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టాలి

### సమీక్ష సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ జులై 29 రవీందర్ ప్రజా తీర్పు**




ఎల్ నీ నో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి సమస్యలు తలెత్తితే తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికలతో చర్యలు చేపట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన గ్రామపంచాయతీ అభివృద్ధి కార్యక్రమాల సామర్థ్య పెంపు పై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, మంజూరైన అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, తాగునీటి సమస్యలు, వ్యవసాయ రంగం, విద్యుత్ సరఫరా, రవాణా సౌకర్యాలు, పంచాయతీరాజ్, రోడ్లు, విద్యా రంగం, ఉపాధి హామీ పనులు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముందస్తు అనుమతి లేకుండా సమావేశానికి గైర్హాజరైన విద్యుత్ శాఖ ఏఈ తీరుపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామ సభలకు సైతం ఏఈ హాజరుకావడం లేదని సర్పంచులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ప్రజలకు అందుబాటులో ఉండకుండా నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాతవాహన యూనివర్సిటీ పనుల కోసం రూ.15 లక్షలు చెల్లించినప్పటికీ ఇప్పటివరకు విద్యుత్ కనెక్షన్ ఎందుకు ఇవ్వలేదని మంత్రి అధికారులను నిలదీశారు. సంబంధిత సమస్యను వెంటనే పరిష్కరించి విద్యుత్ కనెక్షన్ అందించాలని ఆదేశించారు.హుస్నాబాద్ మండలంలో మంజూరైన 240 ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటికే 210 ఇండ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన ఇండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని, నిర్లక్ష్యం చేస్తే ఆయా ఇళ్ల మంజూరులను రద్దు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసిన గ్రామాలకే తదుపరి విడతలో ప్రాధాన్యతనిస్తూ అదనపు ఇండ్లను మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖలకు సంబంధించిన పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, పెండింగ్ టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి సూచించారు. గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. పొట్లపల్లి, పందిళ్ళ, కోహెడ రూట్లలో తక్షణమే ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఈ ఊరికి బస్సు రాలేదు అనే మాట నా దృష్టికి రావద్దని స్పష్టం చేశారు. ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యం అందేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో, తాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. రైతులకు ఆరుతడి పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని, తక్కువ నీటితో అధిక దిగుబడి వచ్చే పంటలను ప్రోత్సహించాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుకు అందుబాటులో ఉన్న సబ్సిడీలు, విత్తనాలు, ఎరువులు, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీఛార్జ్ పిట్లు ఏర్పాటు చేసి భూగర్భ జలాల పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో జలశక్తి సంరక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, నీటి సంరక్షణలో ముందుండే గ్రామాలు అభివృద్ధిలోనూ ముందంజలో ఉంటాయని పేర్కొన్నారు. రెండున్నర ఎకరాలకు పైగా వ్యవసాయ భూమి ఉన్న అర్హులైన రైతులు ప్రభుత్వ నిబంధనల మేరకు రూ.2.50 లక్షల సహాయంతో వ్యవసాయ బావులను తవ్వుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అదనపు తరగతి గదులు, కిచెన్ షెడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్య, సౌకర్యాలు అందించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, మంజూరైన పనులను సకాలంలో పూర్తి చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రతి సమస్యను సమష్టిగా చర్చించి పరిష్కరించుకుందామని, హుస్నాబాద్ మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ కొండల్ రెడ్డి, ఎంపీడీఓ సురేష్, ఏఎంసీ చైర్మన్ తిరుపతి రెడ్డి, ఫ్యాక్స్ చైర్మన్ శివయ్య, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020